



పచ్చగా కళకళలాడుతున్న ప్రధాన రహదారి

అందంగా అమరావతి

పునర్నిర్మాణ శంకుస్థాపనకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రధాని మోదీ రానుండటంతో చకచకా పనులు

- ఇప్పటికే పూర్తయిన ప్రధాన వేదికలు, గ్యాలరీలు
- మోదీ రోడ్డు షో కోసం ప్రత్యేక రోడ్డు నిర్మాణం
- నందనవనాలుగా మారిన ప్రధాన రహదారులు

అమరావతికి వచ్చేవారి కోసం సూచిక బోర్డులు



సభావేదిక వద్దకు రోడ్డు నిర్మాణం



సిద్ధమైన ప్రధాన వేదిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపనకు కౌంట్‌డౌన్ మొదలైంది. వచ్చేనెల 2వ తేదీన వెలగపూడిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననుండటంతో సభా ప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేస్తున్నారు. పనులన్నీ తుదిదశకు చేరుకున్నాయి. ముఖ్యంగా మూడు వేదికల పనులు పూర్తయ్యాయి. సాంస్కృతిక కళావేదికను సంప్రదాయబద్ధంగా సిద్ధం చేశారు. లక్షా ఇరవై వేలమంది కూర్చునేలా మూడు భారీ వేదికలు ఏర్పాటయ్యాయి. వీటిలో గ్యాలరీ పనులన్నీ పూర్తిచేశారు. వీఐపీలు కూర్చోవటానికి సోఫాలు, అధికారులు కూర్చోవటానికి వీలుగా ఫోమ్ కుర్చీలు, ప్రజలు కూర్చోవటానికి వీలుగా కుర్చీలను సిద్ధం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పెద్ద ఎత్తున కూలర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానమంత్రి దిగే హెలిప్యాడ్ నుంచి వేదికకు చేరుకునే వరకూ రోడ్డు మార్గాన్ని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ప్రధాన రహదారులను మొక్కలతో ముస్తాబు చేశారు. అమరావతికి వచ్చేవారు ఎటు వెళ్లాలో తెలుసుకునేలా అధునాతన డైరెక్షన్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.



ఆకాశమంత ఆనందం

గుల్లలమోద క్షిపణి పరిశోధనా కేంద్రానికి తొలగిన అడ్డంకులు

- కేంద్రంతో పాటు రెండోదశ పనుల ప్రారంభానికి సన్నాహాలు
- మే 2న ప్రధాని నరేంద్రమోదీతో వర్చువల్‌గా చేసేందుకు ఏర్పాట్లు


గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం అందుబాటులోకి వచ్చే సమయం ఆసన్నమైంది. అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి మే 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రానుండగా, క్షిపణి పరీక్షా కేంద్ర రెండోదశ పనులను ఆయనతో వర్చువల్‌గా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఈ కేంద్రాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో తిరిగి పట్టాలెక్కించారు. డీఆర్‌డీవో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన క్షిపణి పరీక్ష కేంద్రం కోసం రాబోయే ఐదారేళ్లలో దాదాపు రూ.20 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. దీంతో భవిష్యత్తులో దివిప్రాంతం అభివృద్ధివైపు పరుగులు తీస్తుందని స్థానికులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

6లో

నెట్టెంకు పట్టం

కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నియామకం

జగ్గయ్యపేట శ్రేణుల్లో ఆనందోత్సాహాలు



నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్‌గా విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అధిష్ఠానం నుంచి సోమవారం ఆయనకు సమాచారం అందటంతో నెట్టెం మంగళగిరిలోని కార్యాలయానికి వెళ్లారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, వివాదాలకు దూరంగా ఉండటం, సమర్థనీయతతో పాటు ముక్కుసూటిగా వ్యవహరించే వ్యక్తి కావడం, చంద్రబాబుతో ఉన్న అనుబంధం, గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు విజయం చేకూర్చడంలో కీలకపాత్ర పోషించినందుకే నెట్టెంను ఈ పదవి వరించింది.

ఆవిర్భావం నుంచి టీడీపీలోనే..

టీడీపీ ఆవిర్భావం నుంచి నెట్టెం రఘురాం సేవలందిస్తున్నారు. ఎల్ఎంబీ బ్యాంకు డైరెక్టర్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన 1985లో జగ్గయ్యపేట నుంచి పిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1989లో కాంగ్రెస్ ప్రభంజనంలోనూ విజయం సాధించా రు. 1994లో వరుసగా మూడుసార్లు విజయం సాధించి జగ్గయ్యపేట నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డు సాధించారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జగ్గయ్యపేటలో టీడీపీకి గట్టి పునాది వేశారు. 1996లో కొంతకాలం

మిగతా 6లో..

కరెంట్ కనికట్టు!

గుడివాడలో కొడాలి నాని అండ్ గ్యాంగ్ మరో ధనకార్యం

ప్రైవేట్ వెంచర్‌కు విద్యుత్ శాఖ నిధులు

- 60 పోల్స్, 2 ట్రాన్స్‌ఫార్మర్లు, కండెన్సర్ కేబుల్స్‌కు రూ.30 లక్షలు
- నయాపైసా చెల్లించకుండా పనులు చేయించుకున్న గ్యాంగ్
- వెంచర్‌లోని లబ్ధిదారుల పేరిట దరఖాస్తు చేసి మోసం
- సహకరించిన విద్యుత్ శాఖలోని ఏడీఈ, ఈఈ
- బదిలీల నేపథ్యంలో రూ.6 లక్షల సొంత నిధులు చెల్లింపు



కొడాలి నానికి చెందిన వెంచర్‌లో కరెంట్ పోల్స్



వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని మాజీమంత్రి కొడాలి నాని సాగించిన మరో ధనకార్యం వెలుగులోకి వచ్చింది. గుడివాడ మండలం లింగవరం గ్రామంలో కొడాని నానీకి చెందిన ఓ వెంచర్‌కు నయాపైసా చెల్లించకుండా అప్పనంగా విద్యుత్ శాఖ నుంచి రూ.30 లక్షలు ఖర్చు చేయించారు. స్థానిక ఏడీఈ, ఈఈ సహకారంతో అప్పట్లో పనులు చేయించుకున్న గడ్డంగ్యాంగ్ ఇప్పటి వరకు ఆ సొమ్మును చెల్లించలేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గుడివాడ మండలం లింగవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కల్యాణమండపం వెనుక ప్రాంతంలో మాజీ మంత్రి కొడాలి నాని, ఆయన అనుచరులు కలిసి సర్వే నెంబర్లు 239/1బీ, 2, 240/1బీ, 3, 244/1, 2ఏ, 2బీ, 3, 4, 5, 245/1, 2, 3, 246, 247/1, 2, 3లో మొత్తం 25.44 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. ఈ లే అవుట్‌లో ప్లాట్లను అమ్మిన గడ్డంగ్యాంగ్ ఇంతవరకు లబ్ధిదారులకు అప్పగించలేదు. ఇదే వెంచర్‌లో కొడాలి నాని అండ్ గ్యాంగ్ సాగించిన మరో స్కామ్ ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. వెంచర్‌లో విద్యుత్ లైన్లు వేసేందుకు విద్యుత్ శాఖ ద్వారా రూ.30 లక్షలు ఖర్చు చేయించారు. తన తాబేదారుగా ఉన్న అప్పటి అసిస్టెంట్ డిప్యూటీ ఇంజనీర్ (ఏడీఈ) వెంకటేశ్వరరావు ద్వారా ఈ ఖర్చు చేయించినట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం రాకముందే ఏడీఈ వెంకటేశ్వరరావు మచిలీపట్నం బదిలీ అయ్యారు. ఒక ఇంటికి కనెక్షన్ ఇవ్వాలంటేనే నానా నిబంధనలు పెట్టే విద్యుత్ శాఖ అధికారులు ఏకంగా ఒక వెంచర్‌కు నయాపైసా కట్టకుండా రూ.30 లక్షలు ఖర్చు చేయటం విడ్డూరంగా ఉంది. అడగటమే ఆలస్యం అన్నట్టుగా విద్యుత్ పోల్స్, కండక్టర్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చేశారు. అప్పట్లో నాని వెంచర్‌లో విద్యుత్ లైన్లు వేయటం కోసం పది విద్యుత్ స్తంభాల ఏర్పాటు పేరుతో విద్యుత్ శాఖకు దరఖాస్తు చేయించారు. అది కూడా అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారుల పేరుతో దరఖాస్తు చేయించారు. ఇలా దరఖాస్తు చేయించి, అలా విద్యుత్ పోల్స్ వేయించేశారు. మొత్తం 60 విద్యుత్ పోల్స్, రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఎలాంటి డబ్బు కట్టించుకోకుండానే నాటి ఏడీఈ వేయించారు. వెంచర్‌లో ప్రతి 50 మీటర్లకు ఒక విద్యుత్ పోల్ వేశారు. ఈ లెక్కన 60 విద్యుత్ పోల్స్‌ను 3 కిలో మీటర్ల పరిధిలో వేశారు. ఈ స్తంభాలకు మూడు లైన్ల చొప్పున కండెన్సర్ కేబుల్స్‌ను వేశారు. వీటి మొత్తం ఖర్చు రూ.30 లక్షలు. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా తెలివిగా లబ్ధిదారులతో దరఖాస్తు చేయించి.. తమ స్వకార్యాన్ని పూర్తి చేసుకున్నారు. లబ్ధిదారులతో దరఖాస్తు

మిగతా 6లో..

ట్రాన్స్‌ఫార్మర్ల ఖర్చుకే చెల్లింపులు

వాస్తవంగా ఏడీఈ తాను కట్టిన సొంత డబ్బు కొడాలి నాని వెంచర్‌లో వేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లకే సరిపోయింది. 60 పోల్స్, 3 కిలోమీటర్ల కండెన్సర్ కేబుల్స్‌కు రూ.24 లక్షల చెల్లింపులు జరగలేదు. లబ్ధిదారుల పేరుతో వెంచర్ మొత్తం విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ వేసి ప్రభుత్వం దిగిపోయే వరకు పైసా కూడా వసూలు చేయలేదు. రూ.30 లక్షల విలువచేసే మెటీరియల్‌ను కొడాలి నాని వెంచర్‌కు ఖర్చుపెట్టి, ఆ తర్వాత ఆ మొత్తాన్ని డ్యామేజీ లాస్‌లో చూపించాలన్న ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈ పథకం బెడిసికొట్టడంతో ఏడీఈ చేతి చమురు వదిలించుకోక తప్పలేదు.

పుష్కలంగా పెళ్లి ముహూర్తాలు

మే, జూన్‌లో అధికంగా..

8లో



- జూన్ 11 నుంచి జులై 12 వరకు ఆషాఢం
- రేపు అక్షయ తృతీయ.. పెళ్లిళ్లు కూడా అధికం

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

8లో

రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

6లో

తోటలో ఆటలు

సూరంపాలెంలో మాజీ రౌడీషీటర్ లీలలు

- మామిడి తోటలే డెన్‌గా పేకాట, వ్యభిచారం, బెట్టింగ్‌లు
- ఫుట్‌బాల్ ఆటగాడి హత్యకేసులో ప్రధాన నిందితుడు
- అప్పట్లో రౌడీషీట్ తెరిచిన పటమట పోలీసులు
- తాజాగా రౌడీషీట్ తొలగించడంతో అంఘిక కార్యకలాపాలు



గౌతమ్

అతను వాలీబాల్ ఆటగాడు. అంతకంటే ముఖ్యంగా ఓ మాజీ రౌడీషీటర్. ఓ ఫుట్‌బాల్ ఆటగాడి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇతనిపై పోలీసులు రౌడీషీట్ తొలగించడంతో పేట్రేగిపోతున్నాడు. గన్నవరంలోని సూరంపాలెంలో మామిడి తోటలే కేంద్రంగా డెన్‌ను ఏర్పాటుచేసుకుని బెట్టింగులతో పాటు కోడిపందేలు, పేకాట, వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరంలోని సూరంపాలెంలో మామిడి తోటలే కేంద్రంగా ఓ మాజీ రౌడీషీటర్ వ్యవహారాలు నడిపిస్తున్నాడు. బెట్టింగులు పరుగులు తీయిస్తున్నాడు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో అధికారులు రౌడీషీట్ ఎత్తివేయడంతో పేట్రేగుతున్న అతడు తన వ్యవహారాలను చక్కబెట్టడానికి మరో రౌడీషీటర్‌ను సహాయకుడిగా పెట్టుకున్నాడు. ఇదీ కంపా గౌతమ్ అలియాస్ బాబీ వ్యవహారం. గుణదల పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉండే గౌతమ్ వాలీబాల్ ఆటగాడు. ఓ యువతి విషయంలో రేగిన వివాదంతో కొన్నాళ్ల క్రితం ఫుట్‌బాల్ ఆటగాడు ఆకాశ్‌ను మరికొంతమంది స్నేహితులతో కలిసి చంపేశాడు. జక్కంపూడి కాలనీకి చెందిన గ్యాంగ్‌ను తీసుకుని ఆకాశ్ తన స్నేహితులతో ఉండగా హత్య చేశాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేసి

మిగతా 6లో..

షీట్ ఎలా మాయం?

పోలీసులు హత్యలు, గొడవల్లో పాల్గొనే వారిపై రౌడీషీట్ తెరుస్తారు. చోరీలు పదేపదే చేసేవారిపై క్రైం షీట్ తెరుస్తారు. అనుమానితులపై సస్పెక్ట్ షీట్ తెరుస్తారు. ప్రతి ఆదివారం స్టేషన్లలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు వీరు హాజరుకావాలి. ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి. ఒకసారి రౌడీషీట్ తెరిచాక దాన్ని తొలగించడానికి చాలా ప్రక్రియ ఉంటుంది. ఒకసారి రౌడీషీట్ తెరిచాక అప్పటికి చేసిన నేరంపై తప్ప మరో కేసు నమోదు కాకూడదు. కేసు విచారణ పూర్తయి అందులో నిర్దోషిగా బయటకు వచ్చిన తర్వాత మాత్రమే షీట్‌ను తొలగించాల్సి ఉంటుంది. ఫుట్‌బాల్ ఆటగాడు ఆకాశ్ హత్యలో ప్రధాన నిందితుడిగా ఉన్న గౌతమ్ అలియాస్ బాబీపై కేసు ఇంకా కోర్టు విచారణలో ఉండగానే షీట్‌ను తొలగించారు. కోర్టు ఆదేశాలతో ఈ షీట్‌ను తొలగించినట్లు పోలీసులు చెబుతున్నారు. గౌతమ్‌పై ఇతర జిల్లాల్లోనూ కేసులు ఉన్నాయి. సత్యసాయి జిల్లాలో కియా పోలీస్‌స్టేషన్‌లో బెట్టింగ్ కేసులు ఉన్నాయి. ఇదికాకుండా హైదరాబాద్ కమిషనరేట్‌లోనూ గౌతమ్‌పై ఈ తరహా కేసులు ఉన్నాయి. అయినా అతడిపై ఉన్న షీట్‌ను తొలగించడం గమనార్హం. గౌతమ్‌ను పోలీసులు తేలిగ్గా తీసుకుంటే, తోటల్లో ఉన్న బ్యాచ్‌లు నగరంలోకి అడుగుపెట్టే ప్రమాదం లేకపోలేదు.



మచిలీపట్నం పోర్టు పనులను పరిశీలిస్తున్న మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, కొల్లు రవీంద్ర, మ్యారీటైమ్ బోర్డు సీఈవో దామచర్ల సత్య తదితరులు

పోర్టు, గిలకలదిండి హార్బర్ పనులు పూర్తిచేస్తాం

- మంత్రులు బీసీ జనార్థనరెడ్డి, కొల్లు రవీంద్ర
- రాష్ట్ర అభివృద్ధిలో మచిలీపట్నం పోర్టు కీలకం
- పనులను పరిశీలించిన మంత్రులు

8లో

మోదీ సభకు జిల్లా నుంచి లక్షమంది



మచిలీపట్నంలో హోంమంత్రి అనితకు తన గోడు చెబుతున్న దివ్యాంగురాలు భాగ్యలక్ష్మి

- మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల సమీక్ష
- ప్రధాని పర్యటన విజయవంతానికి కృషి
- లక్షమందిని రాజధానికి తీసుకెళ్లాలని నిర్ణయం

6లో



సోమనాథ్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

దుర్గమ్మ సేవలో డాక్టర్ సోమనాథ్

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవ స్థానంలో కనకదుర్గమ్మను సోమవారం ఏపీ స్పేస్ టెక్నాలజీ సలహాదారు, ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్.పి.సోమనాథ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఏఈవో చంద్రశేఖర్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం, అందజేశారు.

అర్జీల పరిష్కారంలో స్పష్టతకు ప్రాధాన్యమివ్వండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : స్పష్టమైన సమాచారంతో మరల పునరావృతం కాకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు అధికారులు సిబ్బంది నుంచి స్పష్టమైన సమాచారం తీసుకొని తిరిగి పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జవాబుదారీతనంతో అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వి నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.





బ్యాంకు ఖాతాదారులకు డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలపై అప్రమత్తం

» పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు

గుణదల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అక్షరాస్యులున్నప్పటికీ అప్రమత్తంగా లేకపోవడం వల్లనే సైబర్‌క్రైమ్.. డిజిటల్ అరెస్టుల నేరాలు పెరిగిపోతున్నాయని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. ఈ తరహా నేరాలకు చెక్‌పెట్టాలంటే ప్రజలను చైతన్యవంతం చేయాలని, జిల్లా వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో నందిగామ, తిరువూరు స్టేషన్ల పరిధిలో అక్కడి సిబ్బందితో కలిసి బ్యాంకు ఖాతాదారులకు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్ట్ పేరుతో నకిలీ ఫోన్ కాల్స్ వీడియో కాల్స్ ద్వారా ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో అనుమానం వస్తే తక్షణం సమాచారం ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరారు.



ఏడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు సంఘాల నేతలు

ఆ కంపెనీలపై చర్యలు తీసుకోండి

» రైతుసంఘాల నేతల డిమాండ్

మైలవరంరూరల్, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి) : అనుమతి, నాణ్యతలేని మొక్కజొన్న విత్తనాలు విక్రయించి రైతులను మోసగించిన సీజెంటా, కారంటెక్, శ్రీకర్, సిరి తదితర కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మైలవరం ఏడీఏ కార్యాలయం ఎదుట రైతుసంఘాల నాయకులు, రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ, మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు తదితర మండలాల్లోని అనేక గ్రామాల్లో నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారన్నారు. సీడ్ పండించిన రైతులకు తెలియకుండానే వారిపొలాల్లో ఉన్న విత్తనాలను అక్రమంగా తరలించుకుపోతున్నారని, డబ్బులు అడిగితే ఇవ్వకుండా బెదిరిస్తున్నారన్నారు. ఏడీఏకు వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ సర్పంచ్ రాము, ఉల్లిబోయిన గోపాలరావు, తిరుపతిరావు, రామారావు తదితరులు ఉన్నారు.

కిచెన్ గార్డెన్ నిధులు హాంఫట్‌పై మంత్రి లోకేశ్ పేషీ ఆరా!

» ఇద్దరు ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : 'కిచెన్ గార్డెన్ నిధులు హాంఫట్' కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. బాధ్యులైన ఇద్దరు ఎంఈవోలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి లోకేశ్ పేషీ నుంచి సమాచారం కోరటంతో సోమవారం ఆగమేఘాలమీద షోకాజ్ నోటీసులు సిద్ధం చేశారు. విజయవాడ రూరల్ ఎంఈవో వెంకటరత్నం, సెంట్రల్ ఎంఈవో సాంబశివరావులను 24గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని డీఈవో సుబ్బారావు కోరారు. వెంటనే కిచెన్ గార్డెన్ అక్విటెన్స్ రిజిస్టర్ కార్యాలయానికి సమర్పించకపోతే క్రమశిక్షణ చర్యలకు ఆర్జేడీకి నివేదించనున్నట్టు పేర్కొన్నారు.

హెచ్‌ఎంలకు బుజ్జగింపులు..

విజయవాడరూరల్ పరిధిలో ఉన్న మండలాల్లోని హెచ్‌ఎంలకు ఎంఈవో సన్నిహితులు ఫోన్‌లు చేసి బుజ్జగిస్తున్నట్టు తెలిసింది. ఆ నిధులను త్వరలోనే సర్దుబాటు చేయిస్తామని, అక్విటెన్స్‌లు పంపాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే వత్సవాయి మండలం నుంచి 10మంది హెచ్‌ఎంలు అక్విటెన్స్ ఇచ్చేసినట్టు సమాచారం.

జగ్గయ్యపేట వ్యవహారంపై గుంభనం!

జగ్గయ్యపేటలో కిచెన్ గార్డెన్ నిధుల పంపిణీ ఓ యూనియన్ నేతల ద్వారా జరగటంపై డీఈవో కార్యాలయం గుంభనంగా ఉంది. మండలంలో యూనియన్ నేత ద్వారా ఎంఈవో-1 పంపిణీ చేయటం, అక్విటెన్స్‌లు రాకపోయినా స్పందించకపోవటం చర్చనీయాంశమైంది.

ఆకాశమంత ఆనందం

» గుల్లలమోద క్షిపణి పరిశోధనా కేంద్రానికి తొలగిన అడ్డంకులు

» మే 2న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

» తిరిగి పట్టాలెక్కనున్న భారీ ప్రాజెక్టు

» దివి ప్రాంతంలో అభివృద్ధి పరుగులు



గుల్లలమోద దివి ప్రాంతం

అవనిగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నవ్యాంధ్ర మణిహారంలాంటి గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం ఎట్టకేలకు పట్టాలెక్కనుంది. అమరావతి పర్యటనలో భాగంగా మే 2న ప్రధాని మోదీ క్షిపణి పరీక్షా కేంద్రం రెండో దశ పనులను వర్చువల్‌గా ప్రారంభించనుండటంతో దివి వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బందరు ఆర్డీవో స్వాతి నాగాయలంక మండలంలో పర్యటించి క్షిపణి పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. బాలాసోర్ కంటే మెరుగైన సదుపాయాలతో క్షిపణి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని 2011లో డీఆర్డీవో నిర్ణయం తీసుకోగా, దేశంలోని అనేక ప్రాంతాలను పరిశీలించిన అధికారులు 2012లో గుల్లలమోద అనుకూలమైనదిగా గుర్తించారు. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం 381 ఎకరాల భూమిని క్షిపణి పరీక్షా కేంద్రం కోసం కేటాయించగా, 2018లో ఈ ప్రాంతాన్ని సీఆర్‌జెడ్ నుంచి మినహాయిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో తొలిదశ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే కేటాయించిన 381 ఎకరాల భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణం, పరిపాలన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2019లో రెండో దశ పనులకు కేంద్రం అనుమతులిచ్చినప్పటికీ నాటి వైసీపీ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోకపోవటంతో ప్రాజెక్టు అటకెక్కింది. 2021 మధ్య నాటి డీఆర్డీవో చైర్మన్ సతీష్‌రెడ్డి ఈ ప్రాంతాన్ని సందర్శించి గన్నవరం సమీపంలో అతిథి గృహాల నిర్మాణం, ముఖ్య శాస్త్రవేత్తల నివాస సముదాయాల కోసం స్థలం కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరగా, నాటి సీఎం జగన్మోహన్ రెడ్డి ఈ విషయాన్ని పక్కన పెట్టడంతో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. అనంతరం ఈ ప్రాజెక్టును గుజరాత్, తమిళనాడుకు గానీ తరలించాలని భావించినప్పటికీ రక్షణ వ్యవహారాల పరంగా గుల్లలమోద ప్రాంతం అత్యంత అనువైన ప్రాంతం కావటంతో 2024లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వాన్ని మరోమారు డీఆర్డీవో అధికారులు సంప్రదించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించారు.

రూ. 20 వేల కోట్లతో ప్రాజెక్టు పనులు

డీఆర్డీవో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన క్షిపణి పరీక్ష కేంద్రం కోసం రాబోయే సంవత్సరాల్లో సుమారు రూ.20 వేలకోట్లు ఖర్చు చేయనున్నట్టు తెలుస్తోంది. గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం, అవనిగడ్డ, నాగాయలంక మండలాల్లో ఏదో ఒకచోట టౌన్‌షిప్ నిర్మాణం చేపట్టాలని డీఆర్డీవో భావిస్తోంది. 2018లోనే టౌన్‌షిప్ నిర్మాణం కోసం అవనిగడ్డలోని కొన్ని ప్రాంతాలను అధికారులు పరిశీలన చేసినప్పటికీ స్థానిక రైతులు అడ్డు చెప్పారు. టౌన్‌షిప్ నిర్మాణం కోసం ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్టు తెలియవస్తున్నది.

మారనున్న దివి ప్రాంత రూపురేఖలు

డీఆర్డీవో రూ.20వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన క్షిపణి పరీక్షా కేంద్రంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని దివి వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు రావటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలతోపాటు దివి ప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చటం, రోడ్డు కనెక్టివిటీ పెరగటం, ఈ ప్రాంతం మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం అయ్యే అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా దివి ప్రాంతం నవ్యాంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో కీలకంగా మారుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జనవరి నెలలోనే ప్రధాని నరేంద్ర మోదీ పనులు ప్రారంభిస్తారని ముందుగా భావించినప్పటికీ అమరావతిలో జరిగే శంకుస్థాపన కార్యక్రమంలో ఈ పనులను ప్రారంభిస్తారని ఆర్డీవో స్వాతి తెలిపారు. వర్చువల్‌గా ప్రారంభం జరిగే ప్రాంతంలో శంకుస్థాపన ఫలకం ఏర్పాటు, ఆ ప్రాంత వాసులను సమీకరించటం, తదితర పనులపై కలెక్టర్ బాలాజీ ఆదేశాలతో అధికారులు ఇప్పటికే ఎంఐసీ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ సమీర్ శర్మతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నారు.

మోదీ సభకు కృష్ణా జిల్లా నుంచి లక్ష మంది

» అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమ ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారుల సమీక్ష



సమావేశానికి హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

మచిలీపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది కార్యక్రమానికి వస్తారని అంచనా ఉందన్నారు. కృష్ణాజిల్లా నుంచి లక్షమంది హాజరయ్యేలా అంచనాలు రూపొందించినట్టు తెలిపారు. మే 2న ప్రధానమంత్రి మోదీ రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో కార్యక్రమ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ చాంబరులో సోమవారం మంత్రి రవీంద్ర అధ్యక్షతన మంత్రులు వాసంశెట్టి సుభాష్, బీసీ జనార్ధనరెడ్డి, వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు రవీంద్ర, జనార్దనరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేసిందన్నారు. మూడు రాజధానుల పేరుతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కుట్రలు చేసి అమరావతిలో అభివృద్ధి పనులను నిలిపివేశారన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షమేరకు రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూపకల్పన చేశారన్నారు. ప్రధాని చేతులమీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మంత్రులు వాసంశెట్టి సుభాష్, వంగలపూడి అనిత మాట్లాడుతూ, వేసవి కావడంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి ప్రధాని హోదాలో మోదీ తనవంతు సహకారం అందిస్తారని భావిస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, బోడే ప్రసాద్, మాజీమంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరప్రసాద్, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ జి.గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ, నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఎవరి దారి వారిదే..!

» అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమాలపై వేర్వేరుగా సమావేశాలు

» ఎమ్మెల్యేతో కలిసిరాని పలువురు నేతలు



దేవదత్ ఆధ్వర్యంలో సమావేశమైన నేతలు

తిరువూరు : అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషి చేస్తామని నియోజకవర్గ టీడీపీ నేతలు అన్నారు. సోమవారం పట్టణంలోని శావల దేవదత్ కార్యాలయంలో పార్టీ సమన్వయ కమిటీ నేతలు సమావేశమయ్యారు.. ఇదే కార్యక్రమంపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ సెంటర్‌లోని ఒక సమావేశపు హాల్‌లో సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే సమావేశంలో కాకుండా విడిగా సమావేశం నిర్వహించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు తమకు శిరోధార్యమని, పార్టీ కోసం నిత్యం శ్రమిస్తామని, అయితే ఎమ్మెల్యే అధ్యక్షత వహించే కార్యక్రమాలకు దూరంగా ఉంటామని కొందరు ఖరాఖండిగా పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వల్ల అంతా ఇబ్బందులు పడుతున్నట్టు ఆరోపించారు. నియోజకవర్గ పరిస్థితుల్ని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) దృష్టికి తీసుకువెళ్లాలని కొందరు కోరారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్.శ్రీనివాసరావు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పాల్గొనగా, దేవదత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శావల దేవదత్, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, నెక్కళపు వెంకటేశ్వరరావు(బద్దె)డాబాశ్రీను, పలువురు సమన్వయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ 2025-26 విద్యాసంవత్సరంలో ట్రిపుల్‌ఐటీ(ఐఐఐటీ)లో ఆరేళ్ల బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. మే 20 సాయంత్రం 5గంటల వరకు www.rgukt.in లేదా ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నూజివీడు(ఏలూరుజిల్లా), ఆర్కేవ్యాలీ(ఇడుపులపాయ, వైఎస్ఆర్ జిల్లా), ఒంగోలు(ప్రకాశంజిల్లా), శ్రీకాకుళం(శ్రీకాకుళంజిల్లా)లోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జనరల్ అభ్యర్థులు దరఖాస్తు రుసుం రూ.300, రిజర్వ్ కేటగిరీ రూ. 200, ఇతర రాష్ట్రాల అభ్యర్థులు రూ.1000 చెల్లించాల్సి ఉంది. రిజర్వేషన్, పదో తరగతిలో మెరిట్, అర్హత పరీక్షలో మార్కుల ఆధారంగా అడ్మిషన్‌లు ఉంటాయని అధికారులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన కారు

కారును ఢీకొట్టిన టిప్పర్

» ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలు

మైలవరంరూరల్, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ టైరు పంక్చర్ అయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం పుల్లూరు శివారు బాడవ టోల్‌ప్లాజా సమీపంలో జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన వెనిగళ్ల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కారులో విజయవాడ వెళుతున్నాడు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరు వెళుతున్న టిప్పర్ టైర్‌కు పంక్చర్ కావడంతో అదుపుతప్పి వేగంగా కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న వెనిగళ్ల వెంకటేశ్వరరావు కాళ్లు విరిగిపోయాయి. అతడి భార్య నాగలక్ష్మి, కొడుకు లోకేష్‌కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విజయవాడకు తరలించినట్టు మైలవరం ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, సకాలంలో ఎయిర్ బెలూన్లు ఓపెన్‌కావడంతో ప్రాణహాని తప్పినట్టు స్థానికులు చెబుతున్నారు.

కరెంట్ కనికట్టు!

(5వ పేజీ తరువాయి)

చేయించాలన్న సలహా కూడా అప్పట్లో విద్యుత్ శాఖ అధికారులే ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

బదిలీలకు అడ్డు అని..

2023లో అంతర్గత బదిలీల నేపథ్యంలో ఏడీఈ వెంకటేశ్వరరావు బదిలీ కావటానికి ఈ వ్యవహారం ఇబ్బందిగా మారింది. రూ.30 లక్షల బకాయి ఉండటంతో ఆయన బదిలీకి అడ్డుగా పరిణమించింది. దీంతో తానే రెండు ఎస్టిమేట్ల కింద ఒక్కో దానికి రూ.3 లక్షలు చొప్పున రెండింటికి రూ.6 లక్షలు చెల్లించినట్టు తెలుస్తోంది. తాత్కాలిక పేమెంట్ రావటంతో ఆయన బదిలీకి మార్గం సుగమం కాగా మచిలీపట్నం వెళ్లిపోయారు.

ఈఈ డైరెక్షన్‌లోనే..

ఈ బాగోతంలో స్థానిక ఏడీఈతో పాటు అప్పటి ఈఈ పాత్ర కూడా ప్రధానంగా ఉందని తెలుస్తోంది. అప్పట్లో కొడాలి నాని మంత్రి కావటంతో ఆయన చెప్పిందే శాసనం అన్నట్టుగా ఈఈ రామకృష్ణ వ్యవహరించారని తెలుస్తోంది. అప్పట్లో ఎస్ఈగా మురళీమోహన్ ఉన్నారు. ఆయన దృష్టికి తీసుకెళ్లకుండానే ఈఈ డైరెక్షన్ మేరకు ఏడీఈ వెంకటేశ్వరరావు వెంచర్‌కు మెటీరియల్‌ను తరలించినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఈఈ బదిలీకి కూడా ఇబ్బందికరంగా మారుతుందన్న ఉద్దేశంతోనే ఏడీఈతో బలవంతంగా డబ్బు కట్టించినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత ఈఈ కూడా బదిలీపై మచిలీపట్నం వెళ్లిపోయారు.

నెట్టెంకు పట్టం

(5వ పేజీ తరువాయి)

మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. జగ్గయ్యపేట నుంచి తొలిసారి కేబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతగా రికార్డు సాధించారు. 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన ఆయన.. ప్రస్తుత ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను రంగంలోకి దింపారు. 2014 ఎన్నికల్లో తాతయ్య విజయానికి కృషి చేశారు. 2019 ఎన్నికల తర్వాత విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడిగా నెట్టెం బాధ్యతలు చేపట్టి పార్టీని మరింత బలోపేతం చేశారు. 2024 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో కూటమికి తిరుగులేని ఆధిక్యం లభించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయనకు ఎమ్మెల్సీ స్థానం ఇస్తారని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా చంద్రబాబు కేడీసీసీ బ్యాంకు పదవికి నెట్టెం పేరును ప్రకటించారు. కేబినెట్ హోదా కలిగిన ఆప్కాబ్ చైర్మన్‌గా చేస్తానని కూడా చంద్రబాబు ఆయనకు హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.

జగ్గయ్యపేట నుంచి మూడో నేతగా..

ఇంతకుముందు జగ్గయ్యపేట నుంచి కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా నెట్టెం రఘురాం బావ తొండెపు దశరథ జనార్ధన్ ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆయన ఆప్కాబ్ చైర్మన్‌గా, నాప్కాబ్ వైస్ చైర్మన్‌గా జాతీయ స్థాయిలో పనిచేశారు. అనంతరం వైసీపీ హయాంలో జగ్గయ్యపేట నుంచి తన్నీరు నాగేశ్వరరావు ఏడాదిపాటు కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా పనిచేశారు. ఇప్పుడు తిరిగి ఇదే నియోజకవర్గం నుంచి నెట్టెంకు అవకాశం లభించడం విశేషం.

జగ్గయ్యపేటలో ఆనందోత్సాహాలు

నెట్టెం రఘురాంకు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి ఇవ్వడంతో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. రఘురాంకు సముచిత స్థానం కల్పించాలని నియోజకవర్గ పార్టీ అనేకసార్లు ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసింది.

తోటలో ఆటలు

(5వ పేజీ తరువాయి)

రౌడీషీట్ తెరిచారు.

సూరంపాలెంలో డెన్

ఆకాశ్ హత్య కేసుతో రౌడీషీట్ తెరిచిన తర్వాత గౌతమ్ బుద్ధిమంతుడిగా మారినట్టు వ్యవహరించాడు. గన్నవరం సమీపాన ఉన్న సూరంపాలెంలో ఉన్న మామిడితోటల్లోకి మకాం మార్చాడు. నాడు హత్య కేసులో ఉన్న గ్యాంగ్‌తో అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. తోటలో 100 వరకు పందెం కోళ్లను పెంచుతున్నాడు. అక్కడే కోడి పందేలు నిర్వహిస్తున్నాడు. దీంతోపాటు పేకాట, వ్యభిచార కార్యకలాపాలకు తోటలను కేంద్రంగా చేశాడు. వాటితో పాటు బెట్టింగ్ వ్యవహారాలు సాగిస్తున్నాడు. విజయవాడలో తనకు పరిచయం ఉన్న వారిని బెట్టింగ్‌లోకి వచ్చేలా చేశాడు. ప్లంటర్ల నుంచి డబ్బు వసూలు చేయడానికి తనతో పాటు కేసులో ఉన్న నిందితులను ఉపయోగించుకుంటున్నాడు. ఈ వసూళ్లలో జక్కంపూడి కాలనీకి చెందిన కనపర కపిల్‌దేవ్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. అతడిపైనా పటమట పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. గౌతమ్ వ్యవహారాలపై నిఘా పెట్టిన పోలీసులు స్టేషన్‌కు రావాలని సమాచారం పంపారు. తనపై షీట్ లేనప్పుడు ఎందుకు రావాలని పోలీసులను ఎదురు ప్రశ్నించాడు. అక్కడితో ఆగకుండా ఓ ఏసీపీ స్థాయి అధికారి పేరు చెప్పి సమాచారం పంపిన పోలీసులను బెదిరించినట్టు తెలిసింది.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు!

కల్లాల్లోనే ధాన్యం రాశులు.. వాతావరణ మార్పులతో ఆందోళనలో రైతన్నలు



వావిలాల గ్రామంలో ఖాళీస్థలాల్లో ధాన్యం రాశులు

(తిరువూరు, ఆంధ్రజ్యోతి)

మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంచుల కొరత, రవాణా సమస్యలతో కొనుగోళ్లు నిలిచిపోవడంతో కల్లాల్లో, ఖాళీ స్థలాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు ఏక్షంలో వర్షం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 13,181 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈఏడాది సుమారు 47 ఏడువేల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ధాన్యం కొనుగోలు ప్రారంభించిన నాటినుంచి నేటివరకు, సుమారు 10,434 టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

తొలి నుంచీ ఇబ్బందులే..

నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించిన నాటినుంచి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తొలుత కొన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్న, చిన్నకారు రైతులు వరికోతలు పూర్తిచేసి, దిగుబడి అయిన ధాన్యం కలాల్లో ఆరబెట్టిన వారికి గోనేసంచులు ఇవ్వకుండా కొందరు సిబ్బంది ఇబ్బందులు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని రోజులు రవాణా వాహనాల సమస్యతో ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం మిల్లుల టార్గెట్ పూర్తవడంతో ఈ ప్రాంతంలో ధాన్యం కొనుగోలుకు ఆటంకం ఏర్పడింది. గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 250 ధాన్యం మిల్లులు ఉండటంతో హనుమాన్‌జంక్షన్, గుడివాడ, విజయవాడ సమీపంలోని మిల్లులకు ధాన్యం తోలకాలు జరిగేవి. ప్రస్తుతం జిల్లా విభజన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 14 రైస్‌మిల్లుల్లో మూడు వివిధ కారణాలతో నిలిచి పోవడంతో, 11 మిల్లులు అందుబాటులో ఉన్నా ధాన్యం కొనుగోలు చేసుకునే స్థాయి కొన్ని మిల్లులకే ఉంది.

దిగుబడి ఆశాజనకంగా ఉన్నా..

ఈ ఏడాది రబీ దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మద్దతు ధర ఎక్కువగా ఉండటం, 48 గంటల్లో రైతు ఖాతాకు నగదు జమ అవడంతో రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు తోలడంతో గోనెసంచులు, రవాణా వాహనాల కొరత ఏర్పడింది. జిల్లాకు అంచనాలకు మించి గన్నిబ్యాగులు దిగుమతి చేసినా కొరత తీవ్రంగా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతానికి కేటాయించిన మిల్లుల టార్గెట్ పూర్తవడంతో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. రైతులు దిగుబడి అయిన ధాన్యం భద్రపర్చుకునే అవకాశం లేక, అకాలవర్షం పడితే ఎందుకు పనికిరాకుండా పోతాయని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

- శ్వేత, సివిల్ సప్లయిస్ డీటీ, తిరువూరు

నియోజకవర్గంలో రైస్‌మిల్లుల ధాన్యం కొనుగోలు టార్గెట్ పూర్తవడంతో, తిరిగి కొనుగోలుకు అధికారులు ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది అధిక దిగుబడితో పాటు, అన్ని రకాల ధాన్యం కొనుగోలుకు అవకాశం ఇవ్వడం.. రైతులు కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తోలడంతో సంచులు, రవాణా సమస్యలు తలెత్తాయి. ప్రస్తుతం మిల్లులు చేసిన డిపాజిట్‌కు మూడురెట్లు అదనంగా ధాన్యం కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో ఇతర మిల్లులకు ధాన్యం తోలకాల అంశం పరిశీలనలో ఉంది. రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

చదువుతోనే వ్యక్తిగత అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నతస్థానాలకు చేరుకోవడంతో పాటు సామాజికంగా గుర్తింపు సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విద్యార్థులకు సూచించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును హనుమాన్‌జంక్షన్‌కు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తుమ్మల మధుమోహన్ ఆధ్వర్యంలో ఏజీఎం పార్థసారధితో కలిసి కె.చరణ్, జి. రామ్‌చరణ్, డి. ధీరజ్‌కుమార్, టి.పూజ ఎమ్మెల్యేను కలిశారు. విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



ప్రతిభ కనబరచిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

చంద్రబాబు పాలనతో టీడీపీకి మరింత ప్రజాదరణ

పెనమలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజారంజక పాలనతో టీడీపీకి మరింత ప్రజాదరణ పెరిగిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో గంగూరు, తెన్నేరు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరిన సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లుగా, అమరావతి, పోలవరం పూర్తి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్న చంద్రబాబు పనితనాన్ని చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు టీడీపీ పట్ల ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. గంగూరుకు చెందిన అక్బర్‌బాషా నేతృత్వంలో అధికసంఖ్యలో మైనారిటీ నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. షర్మిల, దస్తగిరి, అన్సూర్ బాషా, కె.మరియన్న, అల్లాభక్షు, రఫీ, అంజాద్‌లతో పాటు మరో అరవై మంది చేరారు. నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎంఎల్సీ దువ్వారపు రామారావు, జువ్వా రాంబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, సంగెపు రంగారావు, ప్యారి లతీఫ్, అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

మే2న అమరావతిలో జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభను కూటమి నేతలు, కార్యకర్తలు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పరిశీలకులు దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. అమరావతి పునర్నిర్మాణానికి, రూ.లక్ష కోట్ల విలువయిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వస్తున్న ప్రధాని మోదీ ఏపీ అభివృద్ధిలో కీలక భూమిక పోషించనున్నారని తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఆర్టీసీ ఎన్‌ఎంయూ కార్మికుల నిరసన

హనుమాన్‌జంక్షన్‌రూరల్(గన్నవరం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కాలంచెల్లిన బస్సుల స్థానే కొత్త బస్సులను ప్రవేశ పెట్టాలని, న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎన్‌ఎంయూ కార్మికులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. గన్నవరం డీపో ఎదుట సోమవారం రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు బి.నాగిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబ్జి ప్రారంభించారు. కార్మికుల సమస్యల పట్ల యాజమాన్యం అవలంభిస్తున్న మొండివైఖరికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రిలే నిరాహారదీక్ష ప్రారంభించామన్నారు. సీ అండ్ టీ ప్రమాదాల కేసుల్లో చేస్తున్న బదిలీ లను వెంటనే నిలిపివేయాలని, ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణమే ఇవ్వాలని, ఓటి, భత్యాలను జీతాలతో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. డిపో అధ్యక్షుడు ఏఎస్.రావు, కెవిఆర్.రావు, బషీర్, రామకృష్ణ, కొండలు, కుమార్, బాబు, తదితర డ్రైవర్లు, రంగారావు, పరశురాం, పాల్గొన్నారు.

ఉయ్యూరు : అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం ఉయ్యూరు ఆర్టీసీ డిపో వద్ద పీటీడీ ఉద్యోగులు రిలేదీక్ష చేపట్టారు. అసోసియేషన్ డిపో కార్యదర్శి పీఎం కృష్ణ దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు వెంటనే ఆపాలని, ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, గ్యారేజి ఉద్యోగుల సమస్యలు, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలన్నది డిమాండ్లుగా పేర్కొన్నారు. డిపో కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ పిచ్చయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ పాండవులు, కమిటీ సభ్యుడు ఎల్ఎస్ రావు, క్రియాశీలక సభ్యులు జి సుబ్బారావు, ఏ రాజేశ్‌కుమార్, ఎస్ సారథి దీక్షలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు అరుణోదయ, జయలక్ష్మి, అన్నామణి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.



ఉయ్యూరులో రిలేదీక్షలో పాల్గొన్న పీటీడీ ఉద్యోగులు

మద్యం తాగొద్దన్నందుకు యువకుడి ఆత్మహత్య

పెనమలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఇంటికి రావొద్దన్నందుకు మనస్తాపం చెంది ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వణకూరులో జరిగింది. పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కుందేటి సం పత్ (28) తాపీ పని చేస్తుంటాడు. మద్యం తాగొచ్చి ఇంట్లో గొడవ పడుతుండడంతో కుటుంబ సభ్యులు శనివారం మందలిచారు. దీంతో మనస్తాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పెనమలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ డిక్కీలో నగదు చోరీ

పెనమలూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత అవసరానికి మోటారు సైకిల్ తీసుకెళ్లి డిక్కీలోని నగదును కాజేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరుకు చెందిన ఎం.గణేష్‌కుమార్, అదే గ్రామానికి చెందిన పి.ఆనంద్‌బాలు కొంతకాలంగా పరిచయస్థులు. ఈనెల 26న ఆనంద్‌బాలు వద్దకు గణేష్ కుమార్ వచ్చి పని ఉందని చెప్పి మోటారుసైకిల్ తీసుకెళ్లాడు. కొంత సమయం తర్వాత గణేష్‌కుమార్‌కు ఫోను చేస్తుంటే లిఫ్ట్ చేయడం లేదు. తిరిగి బండి కూడా ఇవ్వ లేదు. దీంతో తాను బండి డిక్కీలో పెట్టిన రూ.2.8 లక్షలతో గణేష్ పరారయినట్లు అనుమానించి ఆనంద్‌బాలు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గృహాలకు దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్,ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఆర్థిక సాయం పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బాపులపాడు హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. సొంత స్థలం, ప్రభుత్వ లే అవుట్‌లో గృహ నిర్మాణం చేపట్టే వారికి ప్రభుత్వం రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులను మే నెల మొదటి వారంలోపు హౌసింగ్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పింగళి విగ్రహాన్ని నిర్లక్ష్యంగా వదిలివేయడం బాధాకరం

హనుమాన్‌జంక్షన్ రూరల్ : జిల్లాకు గర్వకారణమైన జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య విగ్రహాన్ని నిర్లక్ష్యంగా వదిలివేయడం బాధాకరమని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలపూడి పోలీస్‌స్టేషన్ వద్ద పింగళి వెంకయ్య విగ్రహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. మహనీయుడి విగ్రహాన్ని సరియైన ప్రదేశంలో ఉంచి నూతన సొబగులద్దాలని అధికారులను యార్లగడ్డ వెంకట్రావు కోరారు. అట్లూరి రాజశేఖర్, వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు చందమామ బాబు పాల్గొన్నారు.

చదువుతోనే పేదపిల్లలకు ఉజ్వల భవిష్యత్తు

గన్నవరం(ఉంగుటూరు), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని, సమాజంలో సరైన గుర్తింపు, విలువ విద్య ద్వారానే లభిస్తాయని ప్రముఖ సంఘసేవకులు ఈపూరి అనూప్ అన్నారు. గన్నవరం మండలం సూరంపల్లిలో పులపాక వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు సెంట్రల్ కస్టమ్స్ కమీషనర్ పులపాక ఆనందకుమార్ స్పాన్సర్ చేసిన నగదు ప్రోత్సాహకాలను ఇంటర్, పదవతరగతి పరీక్షల్లో ప్రతిభచూపిన 35మంది పేద విద్యార్థినీ, విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదువేలు చొప్పున అందజేశారు. ఈసందర్భంగా అనూప్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టిన ఆనందకుమార్ ఎంతో కష్టపడి చదివి ఉన్నతస్థితికి చేరారని, దేశం గర్వించదగిన అధికారిగా కేంద్రంలో మంచి గుర్తింపు పొందారని ప్రశంసించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులందరూ బాగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. జన్మభూమి మీద అభిమానంతో గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటూ, పేద పిల్లల అభ్యున్నతికి తనవంతు సహాయసహకారాలందిస్తున్న ఆనందకుమార్‌ని ఈసందర్భంగా అభినందించారు. ఐజేఆర్ తెనాలి డివిజన్ అధ్యక్షులు సురేష్, సూరంపల్లి మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, సీఎస్ఐ సంఘపెద్దలు అచ్చయ్య, ప్రభుదాసు, డానియేల్, కమలాకర్, సద్గుణరావు, రమేష్, పునవర్తి లక్ష్మయ పాల్గొన్నారు.



పేదవిద్యార్థులకు నగదు అందిస్తున్న పెద్దలు

బాపులపాడులో కొత్తగా రెండు హైస్కూల్స్

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరంలో మండలంలో కొత్తగా రెండు హైస్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ తెలిపారు. మండలంలో గతంలో ఎనిమిది ఉన్నత పాఠశాలలు ఉండగా, వాటిని 10కి పెంచుతున్నట్లు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బాపులపాడు, వీరవల్లి, వేలేరు, రేమల్లె, ఆరుగొలను, మల్లవల్లి, రామన్నగూడెం,కానుమోలులో హైస్కూల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా కొత్తపల్లి, మడిచర్ల యూపీ స్కూల్స్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ హైస్కూల్స్‌గా మారుస్తున్నామన్నారు. బాపులపాడు, కానుమోలు హైస్కూల్స్‌లో విలీనం చేసిన చేసిన 3,4,5 తరగతులను తిరిగి వెనక్కి పంపుతున్నట్లు తెలిపారు. పది హైస్కూల్స్‌తో పాటు రంగన్నగూడెం, చిరివాడ ప్రాథమిక పాఠశాలలను యూపీ పాఠశాలలుగా మార్చామన్నారు. దీంతో 6 ఫౌండేషన్, 11 మోడల్ ప్రైమరీ, 34 బేసిక్ ప్రైమరీలుగా రూపొందించడం జరిగిందన్నారు. ఫౌండేషన్ స్కూల్స్‌లో 1, 2 తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల సంఖ్య 45లోపు ఉన్న వాటిని బేసిక్ ప్రైమరీ, 45మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న వాటిని మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా పిలవడం జరుగుతుందని తెలిపారు.

ఆలపాటికి ప్రముఖుల నివాళి

ఉంగుటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సీఎం కార్యదర్శి రాజమౌళి బంధువు ఆలపాటి వెంకటేశ్వర్లు పెద్ద వైకుంఠ సమారాధన సోమవారం ఆత్కూరులో జరిగింది. సీఎం ముఖ్య కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర, వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడు, విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, తెలుగుమహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్‌కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, జనసేన నాయకులు గరికిపాటి శివశంకర్, ఎంపీపీ వి.సరోజిని, స్థానిక సర్పంచ్ భూతపాటి ఎస్తేరమ్మ, పంచాయతీ కార్యదర్శి గంటా అప్పారావు, టీడీపీ నాయకులు, అధికారులు ఈకార్యక్రమంలో పాల్గొని, వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రాజమౌళి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తొలుత వెంకటేశ్వర్లు సమాధిని రాజమౌళి తన కుటుంబసభ్యులతో కలిసి సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.



నివాళులర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, సీఎం కార్యదర్శి రాజమౌళి

కౌలు రైతులకు న్యాయం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్(గన్నవరం), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేసే ప్రతి వ్యక్తి రైతేనని, ప్రస్తుతం 90 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని వారికి తగు న్యాయం జరిగేలా మే 12వ తేదీన రెవిన్యూ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఏపీ కౌలుదార్ల సంఘ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. గన్నవరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విస్తృత సమావేశంలో ఏపీ కౌలుదార్ల సంఘ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ స్వామి, ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు పాల్గొన్నారు. కౌలురైతులు పండించిన పంట అమ్ముకునేందుకు, పంట నష్టపోతే పరిహారం పొందలేని దుస్థితిలో ఉన్నారని, కనీసం కౌలుకార్డులు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఏలూరు కాల్వలో గుర్రపుడెక్కను, పూడికను వేసవిలోనే తొలగించడం ద్వారా సకాలంలో సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలుదార్ల సమస్యల పరిష్కారం కోసం మే12న రెవెన్యూ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాలో కౌలుదారులు, వ్యవసాయ కార్మికులు పాల్గొనాలన్నారు. సంఘ నాయకులు కైలే ఏసుదాసు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణస్వామి

ప్రారంభోత్సవానికి సిద్ధంగా పోలీస్ స్టేషన్ భవనం

ఉయ్యూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) :ఉయ్యూరు - కాటూరు రోడ్డులో కాకానినగర్ వద్ద ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జాతీయ రహదారి విస్తరణలో రూరల్ స్టేషన్, సీఐ కార్యాలయం పోగా 2018లో కాకానినగర్ సమీపాన సుమారు కోటిన్నర రూపాయలకు పైగా విలువచేసే స్థలం తహసీల్దార్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యా లయాలతో పాటు రూరల్ పోలీస్ స్టేషన్‌కు అవసరమైన 20 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చి దాతృత్వం చాటుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్ల భవన నిర్మాణాలు ప్రారంభించి సగానికిపై గా పనులు పూర్తిచేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగా వివిధ కారణాల వల్ల ఐదు సంవత్సరాలకు పైగా ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధుల కొరత ఇతర కారణాలతో తహసీల్దార్ కార్యాలయ భవనం, రూరల్ స్టేషన్ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. పట్టణపోలీస్ స్టేషన్ పక్కన ఉన్న చిన్నభవనంలో రూరల్ స్టేషన్ కొనసా గిస్తున్నారు. చాలీచాలని ఇరుకు గదుల్లో రూరల్ స్టేషన్ విధులు నిర్వహించేందుకు ఎస్సై, సిబ్బంది ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో నూతన స్టేషన్ భవనం నిర్మాణం పూర్తిచేసేందుకు అవసరమైన మొత్తాన్ని స్థల దాత సజ్జా వెంకటేశ్వరరావు సహాయం చేయడంతో పనులు వేగంగా జరిగాయి. నిర్మాణం పూర్తి చేసి మేనెలలో అధికారికంగా ప్రారంభోత్సవానికి భవనాన్ని సిద్ధం చేస్తున్నారు.



ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్ నూతన భవనం



కూటమి నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రధాని పర్యటనను జయప్రదం చేద్దాం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : నియోజకవర్గ అధికారులు, కూటమి నాయకులు సమిష్టిగా కృషి చేసి మే 2న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. గన్నవరం కార్యాలయంలో ప్రధాని పర్యటనను జయప్రదం చేసేందుకు చేపట్టవలసిన చర్యలపై అధికారులు, కూటమి నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులను ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని బహిరంగసభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఆహారం, తాగునీరు, అందుబాటులో ఉంచుతామన్నారు. రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి సుమారు 20వేల మందికి పైగా హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్పూరి సాయికళ్యాణి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, బీజేపీ రైతుమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, నాయకులు దయాల రాజేశ్వరరావు, గొడ్డళ్ల చినరామరావు, బొప్పన హరికృష్ణ, పుట్టా సురేష్, వేములపల్లి శ్రీనివాసరావు, జాస్తి శ్రీధర్, శేషుకుమార్, మేడేపల్లి రమ, బోడపాటి రవికుమార్, ఎంపీడీఓ స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బాపులపాడు గ్రంథాలయాధికారి రాజు కోరారు. వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. పుస్తకం పఠనం పట్ల ఆసక్తిని పెంచడం, కథలు చదివి వినిపించడం, ఇండోర్ గేమ్స్ నేర్పి, ఆటల్లో మెలకువలు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి విద్యార్థులు సమక్షంలో పూల మాలవేసి నివాళి అర్పించి శిబిరాన్ని ప్రారంభించారు. ఉంగుటూరు : మండలంలోని ఆత్కూరు, ఉంగుటూరు, తేలప్రోలు, మానికొండ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను సోమవారం స్థానిక గ్రామ పెద్దలు ప్రారంభించారు. సమ్మర్ క్యాంపుల్లో చిన్నారులకు వివిధ అంశాలపై తర్ఫీదునివ్వడం జరుగుతుందని గ్రంథాలయాధికారులు బీవీ కృష్ణారావు, యు.చంద్రశేఖరరావు, బి.శ్రీనివాసరావు, ఎల్.హరికృష్ణ తెలిపారు. పుస్తకపఠనంపై ఆసక్తిని పెంచి, వివిధఅంశాల్లో నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. తొలిరోజు సమ్మర్ క్యాంపులో విద్యార్థులు కథల పుస్తకాలు చదవటం, కథలు చెప్పటం, చెస్, క్యారమ్స్ వంటి ఆటలతో సరదాగా గడిపారు. **ఉయ్యూరు** : ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని జడ్పీహైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి. శ్రీనివాసరావు, బీఎస్ఎన్ఎల్ రిటైర్డు ఇంజనీరు వెల్లంకి కృష్ణప్రసాద్ సో మవారం ప్రారంభించారు. నెలరోజులకు పైగా వివిధ అంశాల్లో ఇచ్చే శిక్షణ సద్వినియోగం చేసుకుని విజ్ఞాన సముపార్జన చేయాలన్నారు. వార్డు కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి, సిద్దార్థ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. సాంబ శివరావు, గ్రంథాలయ అధికారి బి. రమణి, స్రవంతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వేసవి సెలవులను పుస్తక పఠనం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని అభివృద్ధి కమిటీ చైర్మన్ గుమ్మడి వెంకటరామయ్య సూచించారు. పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయంలో అధికారి కృపానందం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించే వివిధ విజ్ఞాన గ్రంథాలను చదువుతూ, చిన్నపాటి కథలను స్వయంగా రాయగలిగే నేర్పును సాధించాలన్నారు. ఎంపీయూపీ స్కూల్ హెచ్ఎం సుమిత్ర, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వీరవల్లి గ్రంథాలయ అధికారి స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సర్పంచ్ పిల్లా అనిత ప్రారంభించారు. వేసవి శిక్షణా శిబిరంలో పుస్తక పఠనంతో పాటు ఇండోర్ గేమ్స్ ఆడటం వల్ల ఎండల బారిన పడకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. గుండపనేని ఉమావరప్రసాద్, ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



వెంకట రమణయ్య చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రంథాలయాధికారి రాజు



అర్జీలు త్వరితగతిన పరిష్కరించండి

» జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్ , ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి జేసీ వినతి పత్రాలు స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్ అంగీకరించారని, రెండెకరాల స్థలం కేటాయించారని, యూనియన్ బ్యాంకు కూడా భవన నిర్మాణాలకు రూ.40 కోట్లు నిధులు మంజూరు చేసిందని, మచిలీపట్నం నగరపాలక సంస్థ మాత్రం భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వడంలేదని భవన నిర్మాణ కమిటీ కార్యదర్శి పి.వి.ఫణికుమార్ తెలిపారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, వాటిని అమలు చేయలని జేసీని ఫణికుమార్ కోరారు. నిడుమోలులో ఆర్ఎస్ నెంబర్ 860లో ఉన్న బండ్ల బాట ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని రైతులు వినతి పత్రం ఇచ్చారు. బీసీ కార్పొరేషన్ రుణాలు సత్వరం మంజూరు చేయాలంటూ బీసీ సంఘాల నాయకులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కోరారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ కొందరు పేదలు జేసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్ఆర్సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మే, జూన్‌లో పుష్కలంగా పెళ్లి ముహూర్తాలు



వన్‌టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వివాహాలు చేసుకునే వారికి వైశాఖ మాసం మే నుంచి జూన్ 8వ తేదీ వరకు పుష్కలంగా ముహూర్తాలు ఉన్నట్లు పంచాంగ కర్తలు చెబుతున్నారు. ఈ ఏడాది ఆషాఢ మాసంలో, జూన్ 11 నుంచి జులై 12 వరకు ముహూర్తాలు లేవని పేర్కొంటున్నారు. జులై 25 నుంచి శ్రావణ మాసంలో కూడా మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. మే 1, 3, 4, 8, 9, 10, 11, 14, 16, 18, 19, 21, 23, 24, 30 తేదీలలో, జూన్ 2, 4, 5, 6, 7, 8 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. ఈ నెల 30వ తేదీన అక్షయ తృతీయ సందర్భంగా అధికంగా పెళ్లిళ్ల జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

కుమారుడి చదువు విషయంలో భర్త మందలించాడని మహిళ ఆత్మహత్య


మేరీలత (ఫైల్)

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కుమారుడు చదువు విషయంలో భర్త మందలించాడని పాలేటిలో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం జరిగింది. పట్టణ పరిధిలో విశాఖ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్‌లో నివాసం ఉంటూ హోంగార్డుగా పనిచేస్తున్న ఇనుపకొండ రవిచంద్రకు భార్య మేరీలత (35), ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు భరత్ చంద్ర జగ్గయ్యపేటలో ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మొదటి, రెండు సంవత్సరాల్లో మూడేసి సబ్జెక్టులు ఆగాయి. ఓపెన్ ఇంటర్ పరీక్ష రాయించినా ఫలితం రాకపోవటంతో పిల్లల చదువు గురించి పట్టించు కోవడంలేదని రవిచంద్ర భార్య మేరీలతను మందలించి ఆదివారం రాత్రి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చే సరికి భార్య కనిపించకపోవటంతో కుమారులు శరత్‌చంద్ర, భరత్ చంద్రలను ప్రశ్నించగా, తాము లేచేసరికి అమ్మ లేదని చెప్పారు. వెంటనే బయట స్నేహితులు, స్థానికులను ఆరా తీయగా పాలేటిపై ఒక మహిళ వెళ్లటం చూశామని చెప్పటంతో జగ్గయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజు ఈతగాళ్లతో వెతికించగా, మేరీలత భౌతికకాయం లభ్యమైంది. ఆమె మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదవడంలేదని తల్లి మందలించిందని బాలుడు బలవన్మరణం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్ర జ్యోతి): చదువుకోవటంలేదని తల్లి మందలించినందుకు 9వ తరగతి విద్యార్థి(14) బలవన్మరణానికి పాల్పడిన ఘటన జగ్గయ్యపేటలో సోమవారం జరిగింది. పట్టణంలో కోదాడ రోడ్డుకు చెందిన బాలుడు చదువుకోకుండా దుర్వ్యసనాలకు లోను కావటంతో ఆగ్రహించిన తల్లి తీవ్రంగా మందలించింది. దీంతో ఆ బాలుడు బాత్‌రూమ్‌లోకి వెళ్లి బాత్‌రూమ్‌లు శుభ్రం చేసే యాసిడ్‌ను తాగాడు. ఎంతకీ బయటకు రాకపోవటంతో తల్లిదండ్రులు గమనించి వెంటనే జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ నుంచి విజయవాడకు తీసుకెళ్లారు. గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

» ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్



మాట్లాడుతున్న ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర శాఖ ప్రతినిధులు కె.తులసీప్రసాద్, చిత్రంలో పరుచూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్, భరత్, సుందర్‌రామ్

మొగల్రాజపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఫెడరేషన్ ఆఫ్ అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర శాఖ ప్రతినిధులు కె.తులసీ ప్రసాద్, పరుచూరి శ్రీనివాసరావు, శ్రీకాంత్, భరత్, సుందర్‌రామ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ గడచిన మూడు సంవత్సరాలుగా రైట్ టు ఎడ్యుకేషన్ కింద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్‌లు ఇచ్చామని, దాని తాలుకా ఫీజులను ప్రభుత్వం రీయింబర్స్ చేయాలని చెప్పారు. 2025-26 సంవత్సరానికి జీవో విడుదల చేశారని, అది విడుదల చేసే ముందు స్టాండర్డ్ ప్రొసీజర్ లేకుండా రాబోయే సంవత్సరానికి ఫీజులు నిర్ణయించకుండా ప్రవేశాల గురించి ప్రకటన చేశారని తెలిపారు. తాము అడ్మిషన్‌లకు వ్యతిరేకం కాదని, గతేడాది 38 వేల అడ్మిషన్‌లు చేశామన్నారు. ఆర్టీఈ యాక్ట్ మీద కోర్టును ఆశ్రయించగా, తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు.

"కేవలం పది కిలో మీటర్ల దూరంలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం.. అక్కడే హైకానిక్ బ్రిడ్జ్.. దాని మీదుగా రాజధాని అమరావతికి పది నిముషాల్లో చేరుకోవచ్చు.. మా వెంచర్ చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు, ఆ పక్కనే విజయవాడ - ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు, ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వే మార్గం వస్తోంది.." అంటూ ఆకర్షణీయమైన బ్రోచర్లతో మాయ చేసేస్తున్నారు కొందరు అనధికార లే అవుట్ల యజమానులు. మ్యాప్‌లు వేసి అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. "మాకు అన్ని అనుమతులున్నాయి. ప్లాట్స్ కొన్నవారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కామన్ సైట్ ఉంది. 40 అడుగులు, 30 అడుగుల రోడ్లు ఉన్నాయి." అంటూ ప్రజలను నమ్మించి తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని అనధికార లే అవుట్లపై ప్రత్యేక కథనం.




జి.కొండూరు మండలం వెంకటాపురంలో కామన్ సైట్ లేని లే అవుట్

రియల్ మాయ!

ఎన్టీఆర్ జిల్లాలో రియల్ ఎస్టేట్ దందా!

- మైలవరం, నందిగామ నియోజక వర్గాల్లో అనధికార లే అవుట్లు
- అనుమతులు లేకుండా యథేచ్ఛగా ప్లాట్ల అమ్మకాలు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి


మైలవరంలో వేసిన అనధికార లే అవుట్

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం): రాజధాని అమరావతికి కూత వేటు దూరంలో ఉన్న ఎన్టీఆర్ జిల్లా అన్ని విషయాల్లో దినదినాభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున జరుగుతోంది. అనధికార రియల్ ఎస్టేట్ లే అవుట్లు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నాయి. కూటమి అధికారంలోకి రావడంతో అనధికార లే అవుట్ల ద్వారా అక్రమార్జన చేసే వారికి కలిసొచ్చినట్లయ్యింది. గతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసిన భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్నారు. వీటిలో చాలా వరకు అనధికార లే అవుట్స్ ఉన్నాయి. సీఆర్‌డీఏ అనుమతులు లేకున్నా అన్ని ఉన్నట్లు కలరింగ్ ఇచ్చి, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టి, ప్లాట్లుగా విభజించి అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా జిల్లాలోని మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో ఇలాంటి అనధికార లే అవుట్స్ అనేకం ఉన్నాయి. రాజధాని అమరావతికి మణిహారంగా చెప్పే అవుటర్ రింగ్ రోడ్డు ఈ రెండు నియోజకవర్గాలను కలుపుతూ వెళుతుండటంతో పాటు కృష్ణానదికి ఉత్తర వైపు రాజధానికి అతి సమీపంగా ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బాగా కలిసి వచ్చింది. అంతేకాక ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు వేస్తున్న రైల్వే లైన్ సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, అక్రమ లే అవుట్లు వేసి విక్రయించుకునే వారికి వరంగా మారింది. మైలవరం - తిరువూరు రోడ్డులో మైలవరం ఊరి చివర ఓ టెంపుల్ సమీపంలో ఇటీవల వేసిన లే అవుట్‌కు ఎలాంటి అనుమతులు లేవు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామ పరిధిలో క్వారీలకు అతి సమీపంలో కొందరు బడాబాబులు అనుమతులు లేకున్నా క్రషర్స్, క్వారీస్ బఫర్ జోన్‌లో వెంచర్స్ వేసి ఆన్‌లైన్‌లో మ్యాప్‌ల మీదే అమ్మేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు.

సీఆర్‌డీఏ పరిధి కావడంతో వదిలేస్తున్న స్థానిక శాఖలు

లే అవుట్ల అనుమతులు అన్ని సీఆర్‌డీఏ పరిధిలో ఉండటంతో స్థానికంగా ఉన్న పలు రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖలకు అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. మొత్తం సీఆర్‌డీఏ చూసుకుంటుందిలే అని స్థానిక ప్రభుత్వశాఖలు మిన్నకుండటంతో ప్లాట్స్ కొనుగోలుదారులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అనధికార లే అవుట్ల నిర్వాహకులు అమ్ముకొని సొమ్ము చేసుకున్న తర్వాత కాని అనుమతులు లేవన్న విషయం బయటకు రావడం లేదు. దీంతో ప్లాట్స్ కొనుగోలు చేసిన వారే మునిగిపోతున్నారు. సీఆర్‌డీఏ అధికారులు స్థానిక అధికారులకు తమ నోటీసుకు వచ్చిన లే అవుట్ల గురించి సమాచారం ఇచ్చినా, లేక స్థానికంగా ఉండే ప్రభుత్వ శాఖల అధికారులు సీఆర్‌డీఏ అధికారులకు సమాచారం ఇచ్చినా వినియోగదార్లు మోసపోకుండా ఉంటారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

కామన్ సైట్‌నూ అమ్మేస్తున్నారు

ఎకరానికి 10 సెంట్లు చొప్పున ప్రతి లే అవుట్‌లో కామన్ సైట్ వదలాల్సి ఉంటుంది. అయితే చాలా వెంచర్లతో కామన్ సైట్స్ ఉండటం లేదు. కొన్ని చోట్ల కామన్ సైట్లలో దేవాలయాలు కట్టి, మిగిలింది కబ్జా చేస్తున్నారు. కొన్ని చోట్ల కామన్ సైట్ అనేది లేకుండా మొత్తం అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఇలాంటి అక్రమ లే అవుట్లపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పోర్టు, గిలకలదిండి హార్బర్ పనులు వేగవంతం

- మంత్రులు జనార్దనరెడ్డి, రవీంద్ర
- రాష్ట్ర అభివృద్ధిలో కీలకం కానున్న మచిలీపట్నం పోర్టు
- పోర్టు, హార్బర్ పనులను పరిశీలించిన మంత్రులు జనార్దనరెడ్డి, రవీంద్ర, అనిత, సుభాష్, ఎమ్మెల్యేలు


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్ తదితరులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: తమిళనాడు రాజధానికి చెన్నై పోర్టు, మహారాష్ట్ర రాజధానికి ముంబయి పోర్టు వలే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి మచిలీపట్నం పోర్టును అభివృద్ధి చేస్తామని మంత్రులు బీసీ జనార్దనరెడ్డి, కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం పోర్టులో జరుగుతున్న పనులను మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులతో కలసి సోమవారం వారు పరిశీలించారు. తొలుత మచిలీపట్నం పోర్టు నమూనాలను సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోర్టు సౌత్ బ్రేక్ వాటర్ చివరి పాయింట్‌కు చేరుకుని పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దనరెడ్డి మాట్లాడుతూ గతంలో పోర్టు పనులు నెమ్మదిగా జరిగాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా మచిలీపట్నం పోర్టు పనులు జరుగుతున్న విధానంపై సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. పోర్టు నిర్మాణంతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపాటు, రాజధానికి దగ్గరలోనే ఉన్న పోర్టు కావడంతో ప్రభుత్వం ఈ పోర్టు అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామన్నారు. మచిలీపట్నం పోర్టు వ్యాపార, వాణిజ్య పరంగా కేంద్ర బిందువుగా ఉంటుందని, భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా మారుతుందన్నారు. పోర్టుకు సంబంధించి రోడ్డు కంరైలు మార్గాలను కలిపేందుకు అన్నిరకాల అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. తొలి విడతలో నాలుగు బెర్తులను పూర్తి చేస్తామని, రానున్న రోజుల్లో మరిన్ని బెర్తులను నిర్మిస్తామని చెప్పారు. ఇప్పటివరకు 30శాతం పనులు పూర్తయ్యాయని, రూ.3,668.83 కోట్ల అంచనాలతో పోర్టు పనులను కాంట్రాక్టుకు ఇచ్చినట్లు వివరించారు. మచిలీపట్నం పోర్టు గేట్‌వే ఆఫ్ అమరావతిగా మారుతుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు ప్రసంగించారు.

మార్చి 2026 నాటికి గిలకలదిండి హార్బర్ పనులు పూర్తి

గిలకలదిండి హార్బర్ పనులను మంత్రులు వాసంశెట్టి సుభాష్, వంగలపూడి అనిత, బీసీ జనార్దనరెడ్డి, కొల్లు రవీంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దనరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు హార్బర్ పనులు 57 శాతం పూర్తయ్యాయని తెలిపారు. 2026 మార్చి నాటికి పనులు పూర్తిచేసేలా గడువు ను పెంచడం జరిగిందన్నారు. హార్బర్ పనులు పూర్తయితే టూరిజం హబ్‌గా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి కొల్లు రవీంద్ర కృషి చేస్తున్నారని తెలిపారు. సముద్ర ముఖద్వారం పూడికతీతకు సంబంధించి సాంకేతికపరంగా ఎలాంటి పనులు చేయాలనే అంశంపై చెన్నైకి చెందిన నిపుణులతో చర్చిస్తున్నామని, 45 రోజుల వ్యవధిలో ఈ నివేదిక వస్తుందని, ఈ నివేదిక ప్రకారం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రముఖ ద్వారం పూడికతీత పనులను పూర్తిస్థాయిలో చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, కలెక్టర్ బాలాజీ, మేఘా సంస్థ జీఎం తులసీదాస్, మారిటైమ్, రైట్స్ సంస్థల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా ఏవీ రావుకు పూర్తి బాధ్యతలు



ప్రభుత్వాస్పత్రి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రభుత్వా స్పత్రిలో అనస్థీషియా డిపార్ట్ మెంట్‌లో సీనియర్ వైద్యులుగా పనిచేస్తూ, తాత్కాలిక సూపరిం టెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ ఏ.వెంకటే శ్వరరావు (ఏవీ రావు)కు సూపరింటె ండెంట్‌గా ప్రభుత్వం పూర్తి బాధ్యతలు అప్ప గించింది. ఆరు ప్రభుత్వం వైద్య కళాశాలలకు కొత్త ప్రిన్సిపాల్స్‌ను, బోధనాస్పత్రులకు ఐదు గురు కొత్త సూపరింటెండెంట్లను నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ప్రిన్సిపాల్స్, ఒక సూపరిం టెండెంట్‌ను బదిలీ చేసింది. ఖాళీలు ఉన్న చోట ముగ్గురు కొత్త ప్రిన్సిపాల్స్, ఐదుగురు కొత్త సూపరింటెం డెంట్లను వైద్య ఆరోగ్యశాఖ నియమించింది.

నేషనల్ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్‌షిప్‌లో గొగులూరి వర్షితకు కాంస్యం



విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భోపాల్‌లో ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగిన 35వ నేషనల్ కెనోయ్ స్ప్రింట్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన విజయవాడకు చెందిన అథ్లెట్ గొగులూరి వర్షిత కాంస్య పతకాన్ని సాధించింది. సబ్ జూనియర్ కే4 500 మీటర్స్ విభాగంలో ఈ పతకం లభించింది. గత అక్టోబర్‌లో కేరళలో నిర్వహించిన ఇంటర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మీట్‌లో పలు విభాగాల్లో నాలుగు పతకాలు, గత నెలలో భువనేశ్వర్‌లో జరిగిన ఒడిశా రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఏడు పతకాలు సాధించి ప్రతిభను సాటింది. ఈ సందర్భంగా వర్షితను పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

ప్రధాని పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

» రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా


విమానాశ్రయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖేష్‌కుమార్ మీనా, శాంతి భద్రతల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఐజీ అశోక్‌కుమార్, డీఐజీ త్రివిక్రమ్‌వర్మ, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, జెసీ గీంతాజలిశర్మ తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధాని మోదీ మే 2వ తేదీన రాష్ట్ర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం శాంతి భద్రతల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఐజీ అశోక్‌కుమార్, డీఐజీ త్రివిక్రమ్‌వర్మ, కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, జేసీ గీంతాజలి శర్మ, తదితర అధికారులతో కలిసి వీవీపీ విరామశాల, కంటైనర్, హెలికాప్టర్ దిగే ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం ఎస్పీజీ వారు భద్రతా ఏర్పాట్లపై ఏఎస్ఎల్, సమావేశం నిర్వహిస్తారన్నారు. విమానాశ్రయ భవనంలో అగ్నిమాపక యంత్రాలను పరిశీలించాలని, ప్రధానమంత్రి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటైనర్ విరామశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని దిశానిర్దేశం చేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. విమానాశ్రయంలో దెబ్బతిన్న టైల్స్‌ను తొలగించి కొత్తవి సిద్ధం చేయాలని చెప్పారు. హైస్పీడ్ అంతర్జాలం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూస్తూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారికి అప్పగించిన పనులను సజావుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విమానాశ్రయ డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి, ఆర్డీవోలు బాలసుబ్రహ్మణ్యం, హేలాషారోన్, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్‌బాబు, అగ్నిమాపక శాఖ అధికారి ఏసురత్నం, ఆర్టీవో శ్రీనివాసరావు, ప్రోటోకాల్ అధికారి మోహన్‌రావు, డ్వామా పీడీ శివప్రసాద్, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, డీపీవో అరుణ, డీఐవో ఫణికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గంగాధర్, ఏపీఎంఐపీ పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'జీవో- 4' ఉత్తర్వులను సవరించాలి

» టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.ప్రసాద్



విజయవాడ(స్పోర్ట్స్), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల పట్ల వివక్ష చూపేలా ఉన్న జీవో నెంబర్ 4ను వెంటనే సవరించాలని ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ జీవో క్రీడాకారుల పాలిట శాపంగా మార నుందన్నారు. గ్రామీణ క్రీడలు, వాటర్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పదేపదే చెబుతున్నప్పటికీ దానికి విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) అధికారులు పనిచేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో దీనిపై ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు ధనియాల నాగరాజు, అట్యాపాట్యా సంఘం కోశాధికారి కృష్ణారెడ్డి, టెన్నిస్ బాల్ క్రికెట్ సంఘం కార్యదర్శి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్

భారతీనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025-26 పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్ పరీక్షలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్, విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ, నందిగామ, తిరువూరు ప్రాంతాల్లో మొత్తం 18 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం పది గంటల నుంచి విద్యార్థులను అనుమతిస్తారని తెలిపారు. ఒక నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్ సేవలు అనిర్వచనీయం : డీఎస్పీ

గుడివాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నియమ, నిబంధనలపై వాహనదారులకు అవగాహన కలిగిస్తూ, పోలీస్ శాఖలో ట్రాఫిక్ ఎస్సై అందించిన సేవలు అనిర్వచనీయమని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో పదవీ విరమణ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ తనకు పోలీస్ శాఖపరంగా సహాయ,సహకారాలందించిన వారికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు కొండపల్లి శ్రీనివాస్, చల్లా నాగప్రసాద్, ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు, పాల్గొన్నారు.



ట్రాఫిక్ ఎస్సై ప్రసాద్‌ను సత్కరిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్



మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్

నీటి ఎద్దడి నివారణే ధ్యేయం

గుడివాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ కోరారు. సోమవారం మున్సిపల్ నూతన కమిషనర్ సింహాద్రి మనోహర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి, మంచినీటి సమస్యలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, సాయన రాజేష్, సీతారాం, నాగూర్, వెంకట్రావు, మురళీ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్యూరిఫై ఫిల్టర్‌ను బహూకరిస్తున్న తిరుపతయ్య

వృద్ధాశ్రమానికి వాటర్ ఫిల్టర్ వితరణ

గుడివాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బొగ్గరపు విజయ్‌కుమార్ జ్ఞాపకార్థం ఆయన తండ్రి బొగ్గరపు తిరుపతయ్య శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమానికి వాటర్ ప్యూరిఫై ఫిల్టర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్, స్టేడియం కమిటీ మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షులు పోకూరి మోహనరావు, చింతపల్లి ప్రసాద్, బి.శ్రీనివాసరావు, రూప్‌చంద్ జైన్, మాచర్ల రామకృష్ణ, తాతారావు, మునీంద్ర, రామారావు, అర్జా ప్రసాద్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ చెరువులకు నీళ్లు రానీయండి

● డీసీ చైర్మన్ బొమ్మనబోయిన ఏసుబాబు

నందివాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలువల ద్వారా నీళ్లు వదిలింది. ఆ నీళ్లను చేపల చెరువుల యజమానులు ఒక్కొక్క చెరువు వద్ద ఏడు, ఎనిమిది మోటార్లు బిగించి కాలువల ద్వారా వచ్చే నీళ్లు కిందకు వెళ్లకుండా తోడేసుకుంటున్నారని నందివాడ డీసీ చైర్మన్ బొమ్మనబోయిన ఏసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం చంద్రయ్య కాలువపై చేపల చెరువుల యజమానులు నీటిని తోడటానికి ఉపయోగించుకున్న మోటార్లను ఉనికిలి డీసీ ఉపాధ్యక్షులు శ్రీమన్నారాయణ ,ఇంగిలంపాక సర్పంచ్ సంపత్ రాజు, చలసాని కోటేశ్వరరావు, ఉప్పల వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ గుమస్తా ఫైడేశ్వరరావు, తమిరిశ షిషర్ డిపార్ట్‌మెంట్ అధికారిణి రోహిణి, మరి కొంతమంది సభ్యులతో కలసి వెళ్లి పరిశీలించారు. సుమారు ఐదు, ఆరు చోట్ల మోటార్ల వెనుక భాగం సెక్షన్ పైపు ఫ్లాంజీలను తొలగించారు. పంచాయతీ చెరువులు నింపే వరకు మోటార్లు వేయవద్దన్నారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ కాలువలు వచ్చి ఐదు, ఆరు రోజులు అవుతున్నా ఇంత వరకు శివారు గ్రామాలకు, పంచాయతీ చెరువులకు సైతం నీళ్లు అందటం లేదన్నారు. ఇరిగేషన్, ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ అధికారులకు ఫోన్ ద్వారా తెలుపారు. అయితే తమ సిబ్బంది అంతా కాలువల మీదే ఉన్నారంటున్నారు. కానీ ఏ సిబ్బంది కూడా అక్రమంగా తోడుకుంటున్న వారిని ఏమీ అనటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువైపు దోసపాడు కాలువపై కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఏ ఒక్క చేపల రైతులను నీళ్లు తోడకుండా కట్టడి చేసే పరిస్థితి లేదన్నారు. అధికారులంతా పాత ప్రభుత్వ పద్ధతిలోనే ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అవుతున్నా సంబంధిత అధికారులు తీరు మారలేదని వాపోయారు. అనంతరం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ చేపల చెరువుల మోటార్లే కాకుండా తూడు తొలగింపు పనులు సరిగా చేయకపోవటం వల్ల చంద్రయ్య కాలువల్లో తూడు కిలోమీటర్ల వరకుపేరుకుపోయిందన్నారు. దీంతో కిందకు నీళ్ల సరఫరా కావడం లేదన్నారు.

చేపల చెరువుల రైతులకు నోటీసులిస్తాం

చేపల చెరువుల రైతులకు నోటీసులు ఇస్తాం. శివారు గ్రామాలకు నీరందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

భరత్ , ఇరిగేషన్ డీఈ



నీళ్లు తోడటానికి ఏర్పాటు చేసిన మోటార్ల ఫ్లాంజ్‌ను తొలగిస్తున్న అధికారులు



చంద్రయ్య కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ఆర్ఎంపీలకు సర్టిఫికెట్లు అందజేత

తోట్లవల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో రోగులకు ఆర్ఎంపీలు మంచి సేవలు అందించాలని తహసీల్దార్ ఎం. కుసుమకుమారి కోరారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా గతేడాది శిక్షణ పొందిన ఆర్ఎంపీలకు శిక్షణ సర్టిఫికెట్లను ఆమె సోమవారం అందజేశారు. 16 గ్రామాలకు చెందిన 28 ఆర్ఎంపీలకు సర్టిఫికెట్లు అందించారు.



ఆర్ఎంపీలకు సర్టిఫికెట్లు అందించిన తహసీల్దార్ కుసుమకుమారి

సబ్సిడీ రుణాలకు సిబిల్ స్కోర్ అడ్డంకి

గుడివాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలు పేద, మధ్య తరగతి నిరుద్యోగ యువతకు రుణాలను సిబిల్ స్కోర్ నెపంతో తిరస్కరిస్తున్నారని వైసీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు తాళ్లూరి ప్రశాంత్ ఆరోపించారు. సోమవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంవద్ద గల ఆయన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బ్యాంకర్ల వైఖరి హేళనగా ఉందని, బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్షత చూపడం దారుణమన్నారు. సబ్సిడీ రుణాలకు సిబిల్ స్కోర్‌ను మినహాయింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



తాళ్లూరి ప్రశాంత్

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

కూచిపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాజ గ్రామంలో తాగునీరు సక్రమంగా అందటం లేదని 1, 9, 10వ వార్డులకు చెందిన గ్రామస్థులు కాజ సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో సోమవారం నిరసన తెలిపారు. ఈ వార్డుల్లో తాగునీరు సక్రమంగా అందకపోవటం వల్ల 100 కుటుంబాల వారు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. నీటి కుళాయిలు సరిపడినన్ని లేకపోవటంతో వేసవిలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఐలూరు నుంచి పైపులైన్ ద్వారా వచ్చే వాటర్ తమ వార్డులకు రావటం లేదన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలన్నారు. అనంతరం వార్డుల్లో తగినన్ని నీటి కుళాయిలు అమర్చాలని గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. నాగ దుర్గా భవాని, ప్రమీల, శీలం నారాయణరావు, కరుణాకరరావు, జోగి నాగలక్ష్మి, కాంతమ్మ, శ్రీలక్ష్మీ, పద్మ, రమాదేవి పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

సర్క్యులర్ 1/2019ని వెంటనే అమలు చేయాలి

గుడివాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : సర్క్యులర్ 1/2019ని వెంటనే అమలేసి, నైట్ షిఫ్ట్ అలవెన్సును రూ.400లకు పెంచాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ గుడివాడ గ్యారేజ్ కార్యదర్శి కృష్ణమూర్తి డిమాం డ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేపట్టిన రెండ్రోజుల రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకూ యూనియన్ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. ఈ దీక్షల్లో నాయకులు సురేష్, కె.వి.ఎస్ రావు, హరికృష్ణ, శబరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయూ నాయకులు

చెట్లు నరికివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● నిడుమోలు సర్పంచ్ అంజలి

కూచిపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి తూట్లు పొడుస్తూ గ్రామానికి చుట్టూ ఉన్న వృక్షాలను నరికివేసి ఆ కలపను అమ్ముకుని సొమ్ము చేసుకున్న నేతలపై చర్యలు చేపట్టాలంటూ నిడుమోలు గ్రామ సర్పంచ్ కొమరగిరి అంజలి తెలిపారు. ఈ మేరకు జూనియర్ అసిస్టెంట్ ఎం.రాజేష్, వైస్ ఎంపీపీ డొక్కు వెంకటేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ డొక్కు మురళీ, పలువురు గ్రామస్థులతో కలిసి ఆమె ఎండీవో జె.విమాదేవికి సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేశారు. నిడుమోలు గ్రామపంచాయతీ పరిధిలోని బందరు రోడ్డులో గల పొలాల మధ్య ఉన్న సాలెవాని చెరువు చుట్టూరా 40 దశాబ్దాల నుంచి ఉన్న భారీ వృక్షాలైన వేప, తుమ్మ, నేరేడు తదితర వృక్షాలను గ్రామ టీడీపీ నాయకులు గొంతుపులి రాము, సురేష్, షరీఫ్‌లు నరికి ఆ కలపను అమ్మి సొమ్ము చేసుకున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలంటూ వినతిపత్రంలో వారు కోరారు.



ఎండీవో విమాదేవికి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ అంజలి

కిశోర వికాసంపై శిక్షణ

పెదపారుపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి మండలంలోని వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ కుమారి, ఎం.శివ నాగమణిల అధ్యక్షతన మండల స్థాయిలో కిశోర వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా పోలీసు కన్వీనర్‌గా ఉండి అంగన్వాడీ కార్యకర్త, సచివాలయ ఏఎస్ఎం, ఆశావర్కర్, వీవోఏ ఐదుగురు కమిటీలుగా ఏర్పడాలన్నారు. మే 2 నుంచి జూన్ 10వరకు గ్రామాల్లో 15 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల కిశోర బాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేయాలన్నారు. వారికి ప్రతీ మంగళవారం, శుక్రవారం విలేజ్ లెవల్ కమిటీలు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వయస్సులో ఉన్న బాలికలు చదువుతూ ఉన్న, చదువు మానేసినా, వివాహమైనా ఈ గ్రూపులో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి పెదపారుపూడి డీపీహెచ్‌సీ డాక్టర్ డి.శ్రావిక, ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, ఎంపీఎం మహంకాళరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ కుమారి

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణకు మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, మైఖేల్, పినిశెట్టి వేణు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగఛాయాదేవి తదితరులు అభినందనలు తెలిపారు.





పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆరాధన మహోత్సవాలు

గుడివాడ : స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 54వ వార్షిక ఆరాధన మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారి కలశస్థాపన కార్యక్రమంలో శ్రీనివాసరావు, శివలీల దంపతులు చేతుల మీదగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహోత్సవ కమిటీ అధ్యక్షుడు కోట నూకరాజు, కన్వీనర్ సూరిబాబు, చింతలూరి సత్యనారాయణ, వసుధ బసవేశ్వరరావు, ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో శ్రీనివాస్

పెదపారుపూడి : వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి వంగా శ్రీనివాస్ అన్నారు. పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డి.భాస్కరరావు విద్యార్థుల మనోవికాసం గ్రంథాలయాల పాత్రను వివరించారు. గ్రంథాలయ అధికారిణి ఎంవి.ఎస్.లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పామర్రు : ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు పుస్తకపఠనంపై మక్కువ పెంచుకోవటం ద్వారా మేథోశక్తి పెంపొందించేందుకు దోహదపడుతుందని పామర్రు గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి, జమీగోల్వేపల్లి మహిళ మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవిలు పేర్కొన్నారు. మండలంలోని రెండు గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతులను వారు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు.పామర్రులో విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. తొలుత గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గుడివాడ రూరల్ : చౌటపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు జి.రత్నచంద్ర మాట్లాడుతూ బాలబాలికల మనోవికాసానికి వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయన్నారు.

ఉయ్యూరు : వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పమిడిముక్కల సర్పంచ్ ముళ్లపూడి సునీత అన్నారు. పమిడిముక్కల శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. తలిదండ్రులు పిల్లలను గ్రంథాలయానికి పంపించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి శిక్షణ శిబిరం లక్ష్యాన్ని వివరించారు.

ప్రధాని మోదీ పర్యటన విజయవంతం చేద్దాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజధాని అమరావతి తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, అమరావతి పనులను ప్రారంభించేందుకు రాష్ట్రానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయడంలో భాగస్వామ్యులవుతామని మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు అన్నారు. రాజధాని పునఃనిర్మాణ పనుల ప్రాంభోత్సవానికి మే 2వతేదీన విచ్చేస్తున్న ప్రధాని మోదీ పర్యటన విజయవంతానికి సంబంధించి సోమవారం స్థానిక ప్రజావేదికలో కూటమి ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జవహర్ మాట్లాడుతూ అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి గుడివాడ నియోజకవర్గం నుంచి కూటమి శ్రేణులు, ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ కూటమి నాయకులందరిని సమన్వయం చేసుకుని, మోదీ సభకు గుడివాడ నుంచి 15వేల మందికి పైగా ప్రజలు పాల్గొనేలా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకురాలు నూకాలమ్మ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగడాల సతీష్, కూటమి నాయకులు రాంబాబు, మజ్జి శ్రీనివాస్, అడుసుమిల్లి చిట్టిబాబు, కొడాలి రామరాజు, చాట్రగడ్డ రవి, కంచర్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి జవహర్, ఎమ్మెల్యే వెనిగండ్ల

పామర్రు : రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి మే రెండోతేదీ అమరావతికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ పర్యటన విజయవంతానికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ ముఖ్యనేతల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గం నుంచి ప్రభుత్వం 30 బస్సులను ఏర్పాటు చేసిందన్నారు. వాటికి అనుగుణంగా టీడీపీ నేతలు గ్రామాల్లో కార్యకర్తలను సమన్వయం చేసి అమరావతికి మోదీ సభకు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోదీసభ నిర్వహణ పామర్రు సమన్వయకర్త బుద్ధ జగదీష్, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : మే నెల 2న ప్రధాని అమరావతి పర్యటన ఉన్నందున మండలంలోని ప్రజలను తరలించటానికి సకల ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ తెలిపారు. మండలానికి పది బస్సులు కేటాయించారని, వారికి అన్ని వసతులు కల్పించి పంపటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. వెలుగు, ఉపాధి హామీ పథకం, ఇతర శాఖల సమన్వయంతో ప్రధాని సమావేశానికి తరలిస్తామని తెలిపారు.



పరీక్షలు రాస్తున్న నాట్య విద్యార్థులు

ఎంపీఏ నాట్య రాత పరీక్షలు ప్రారంభం

కూచిపూడి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో ఎంపీఏ ద్వితీయ సంవత్సరం నాట్య రాత పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. నాట్యము, రస పరిశీలన అంశానికి సంబంధించి పరీక్షలు నిర్వహించారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, పరిశీలకులుగా యేలేశ్వరపు శ్రీనివాస్‌లు వ్యవహరించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా బండి రామకృష్ణ



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణకు మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, షైఖేల్, పినిశెట్టి వేణు, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగచాయాదేవి తదితరులు అభినందనలు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లు

ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్ల ధర్నా

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల సర్వీసు నిండిన కమ్యూనిటీ హెల్త్ ప్రొవైడర్లను పర్మినెంట్ చేయాలంటూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘ నాయకులు ఝాన్సీ, నాగమణి, నాగబాబు, మణికంఠ, మాధురి, షైనీప్రియ నాయకత్వం వహించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ, ఏడాదిగా పీఎఫ్ ప్రీమియం జమ కావడం లేదన్నారు. ఆరోగ్యభద్రతలో కీలకపాత్ర వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరారు.



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

అవనిగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపి దివిసీమ విద్యార్థులు భవిష్యత్‌లో ఏ రంగాన్ని ఎంచుకున్నా ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. అవనిగడ్డలోని తన కార్యాలయంలో పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 26 మంది విద్యార్థులను, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సోమవారం ఆయన ఘనంగా సత్కరించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఎంతో విశ్వాసంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన తల్లిదండ్రులు అభినందనీయులన్నారు. అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ప్రిన్సిపాల్స్ వీరరవి, కుమార్, నరసింహారావు, ఎంఈవోలు ఎస్.శివశంకర్, అన్నపరెడ్డి పిచ్చియ్య, రామదాసు, విశ్వనాథపల్లి శ్రీనివాసరావు, జి.ఎన్‌బి.గోపాల్, మోమిన్, రామారావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



జేసీ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేస్తున్న పడవల త్రినాథ్

రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద డివైడర్ ఏర్పాటు చేయాలి

గూడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద రెండో డివైడర్ ఏర్పాటు చేయాలని అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాథ్ సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో జేసీ గీతాంజలి శర్మకు వినతిపత్రం సమర్పించారు. రెండో డివైడర్ పోవడంతో వాహనాలు రాంగ్ రూట్‌లో వెళ్లడం వలన ప్రమాదాలకు గురవుతున్నారని, రెండో డివైడర్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరినట్టు త్రినాథ్ తెలిపారు.

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీకి మత్స్యకారుల పాలాభిషేకం



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాగాంజనేయులు

నాగాయలంక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వేట నిషేధ భృతి రూ.10 వేలు నుంచి 20 వేలకు పెంచి బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మత్స్యకార సంఘాల నాయకులు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. నాగాయలంక మత్స్య భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ నేత లకనం నాగాంజనేయులు మాట్లాడుతూ బోట్లు ఎన్యుమరేషన్ నిర్వహించిన వెంటనే భృతి అందించటం కూటమి ప్రభుత్వానికి సాధ్యమైందన్నారు. మత్స్యకార సంఘ నేతలు కర్రి కృష్ణమూర్తి, నాగిడి తాతారావు, లంకే శ్రీనివాస ప్రసాద్, ఓలేటి గొందియ్య, కొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

షణ్ముఖ శ్రియకు చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ సత్కారం



అవనిగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ నేతృత్వంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన షణ్ముఖ శ్రియను సంస్థ కార్యాలయంలో కార్యదర్శి డి.వి.లీలాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పంద్రాజు వరప్రసాద్, యాసం శోభన్ బాబు, అన్నపరెడ్డి కృష్ణ, బండే శ్రీనివాసరావు, మోపిదేవి శ్రీనివాసరావు, నీలకంఠం రామ్మోహనరావు, అద్దేపల్లి నాగేశ్వరరావు, రేపల్లె వెంకటేశ్వరరావు, యాసం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనువైన చోట స్థలాలు కేటాయించాలి : సుగ్గన



ఘంటసాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు అనువైన చోట నివేశనాస్థలాలు కేటాయించాలని జనసేన నాయకులు సుగ్గన పవన్ కుమార్ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కోరారు. అవనిగడ్డలో మర్యాద పూర్వకంగా సోమవారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని అందజేసి సమస్యను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం గ్రామానికి చెందిన 229 మంది లబ్ధిదారులకు ఐదు కిలోమీటర్ల దూరంలో నివేశనాస్థలాలు కేటాయించారన్నారు. 110 మంది లబ్ధిదారుల వద్ద రూ.20 వేలు తీసుకుని కేవలం బేస్‌మెంట్ పోసి వదిలేశారన్నారు. కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవటంతో లబ్ధిదారులు ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లటానికి ఇష్టపడటం లేదని పవన్ తెలిపారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌కు కూడా అర్జీని అందజేయాలని సూచించినట్లు సుగ్గన పవన్ తెలిపారు.



బందరుకోటలో మంత్రి జనార్దనరెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న హసీంబేగ్, కాగిత తదితరులు



హోం మంత్రి అనితకు బందరులో స్వాగతం పలుకుతున్న తెలుగు మహిళలు



బందరుకోట రామాలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రులు జనార్దనరెడ్డి, రవీంద్ర తదితరులు

మంత్రులు అనిత, జనార్దనరెడ్డిలకు ఘనస్వాగతం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం తొలిసారిగా వచ్చిన రహదారులు, భవనాల మంత్రి బి.సి.జనార్దనరెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, హోం మంత్రి అనితలకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బందరుకోట రామాలయం వద్ద రవాణా మంత్రి జనార్దనరెడ్డికి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామెర్ల సత్య, ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్రకు రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు హసీంబేగ్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, ఎనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. గిలకలదిండి హార్బర్‌కు వచ్చిన హోం మంత్రి అనితకు తెలుగు మహిళలు పాలపర్తి పద్మజ, ఆర్డీవో కె.స్వాతి స్వాగతం పలికారు.

బందరుకోట రామాలయం సందర్శన

బందరుకోటలోని రామాలయాన్ని రవాణా మంత్రి బి.సి.జనార్దనరెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, గనుల మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య, ఎమ్మెల్యేలు వర్ల కుమార్‌రాజా, ఎనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్ తదితరులు సందర్శించారు. సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రులు, ఎమ్మెల్యేలను ఆశీర్వదించారు.

హోం మంత్రి అనితకు మహిళల వినతులు



ఇళ్ల మధ్య మద్యం షాపు తొలగించాలని హోం మంత్రి అనితను కోరుతున్న మహిళలు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం పోతేపల్లిలో ఇళ్ల మధ్య మద్యం షాపును తొలగించాలని మహిళలు హోం మంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మహిళలు తమ గోడు వినిపించుకున్నారు. ఇళ్ల మధ్య వైన్‌షాపు ఉండటం వల్ల పడే ఇబ్బందులను మహిళలు దాసరి నాగలక్ష్మి, గుంటుపల్లి కృష్ణకుమారి, గంధం లక్ష్మి, కె. సుజాత వివరించారు. బుక్‌కీపర్ నిమ్మగడ్డ సుధ అక్రమాలకు పాల్పడడంతో ఇబ్బందులకు గురవుతున్నట్టు గుండుపాలెం మహిళలు హోం మంత్రికి ఫిర్యాదు చేశారు. తనను భర్త వదిలిపెట్టి వెళ్లిపోయాడని, తనకు ఒక కుమార్తె ఉందని, ఉద్యోగం ఇప్పించాలని దివ్యాంగురాలు భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేసింది.

రాముడుపాలెం రోడ్డు అధ్వానం

• కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయాలని వినతి

(ఆంధ్రజ్యోతి-చల్లపల్లి)

మండలంలోని నడకుదురు శివారు రాముడుపాలెం వెళ్లే ప్రధాన రహదారి మొత్తం గోతులతో అధ్వానంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధిని పట్టించుకోకపోవటంతో రహదారిలోని పెద్ద పెద్ద గోతులు వాహనదారులకు ప్రాణసంకటంగా తయారయ్యాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వ హయాం లో కృష్ణా పుష్కరాల సందర్భంగా రాముడుపాలెం రహదారిని బీటీ రోడ్డుగా నిర్మించారు. రాముడుపాలెం అడ్డరోడ్డు నుంచి కరకట్ట వరకు బీటీ రోడ్డు, సీసీ రోడ్డును నిర్మించగా అప్పటి వరకూ ప్రజలు ఎదుర్కొన్న రహదారి కష్టాలు తీరాయి. రాముడుపాలెం రహదారి మీదుగా నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రాముడుపాలెం, దళితవాడ, ఉత్తరపాలెం, నాదెళ్లవారిపాలెం దళితవాడ, కరకట్ట మీదకు ఈ రహదారి మీదుగా ప్రయాణం సాగిస్తుంటారు. వ్యవసాయ సీజన్‌లో ట్రాక్టర్ల రాకపోకలు జరుగుతుంటాయి. ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, రిక్షాల రాకపోకలు సాగించే రాముడుపాలెం రహదారి పూర్తిగా గోతులమయంగా మారి ఇబ్బందులు కలిగిస్తోంది. వర్షాకాలంలో ద్విచక్ర వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి దుస్థితి. సాగునీటి సరఫరా కోసం రోడ్డు కిందగా తూము ఏర్పాటుచేశారు. ఈ తూముకు ఇరువైపులా రంధ్రాలు పడి ప్రమాదకరంగా మారితే రాళ్లతో పూడ్చిపెట్టారు. గత ప్రభుత్వంలో కనీసం మరమ్మత్తులైనా చేసి ఉంటే రహదారి పూర్తి దెబ్బతినకుండా ఉండేది. అడుగడుగునా రహదారి దెబ్బతిని రాళ్లలేచి ఇబ్బందికరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో రాముడుపాలెం రహదారిని అభివృద్ధి చేయాల్సిందిగా గ్రామస్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



పెద్ద పెద్ద గోతులతో రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రాముడుపాలెం రహదారి

మూగజీవాల దాహార్తి తీర్చడమే లక్ష్యం



పులిగడ్డ, హంసలదీవిలో నీటి తొట్టెలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తీర గ్రామాల్లో వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. పులిగడ్డ గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.38,450లతో నూతనంగా నిర్మించిన పశువుల నీటి తొట్టెను ఆయన సోమవారం ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సాంబశివరావు, సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ పులిగడ్డ విచ్చేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, మండలి శివ ప్రసాద్, మండలి శేషు, ఏపీఎం రవికుమార్, కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** వేసవి నేపథ్యంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని హంసలదీవిలో నూతనంగా నిర్మించిన పశువుల నీటి తొట్టెలను ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఉపాధ పథకం నిధులు రూ.38,450లతో తొట్టెను నిర్మించారు. నీటి సంఘం అధ్యక్షుడు ఇజ్జినేని శివాజీ, మండల పశువైద్యాధికారి ఎండి.షఫీ, ఏపీఎం రవికుమార్, నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడు, కమతం నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పాలకాయితిప్ప పాఠశాల వార్షికోత్సవం



నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న బాలికలు

కోడూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తీర గ్రామాల విద్యార్థులు ప్రతిభతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు.

పాలకాయితిప్ప ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన బాల్య వివాహ దుష్పరిణామాలు, తల్లిదండ్రుల గౌరవించడం అంశాలను నృత్య రూపకం ఆకట్టుకుంది. ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, సర్పంచ్ కొక్కిలిగడ్డ భిక్షాలు, నీటి సంఘం అధ్యక్షులు ఇజ్జినేని శివాజీ, మాజీ సర్పంచ్ కొక్కిలిగడ్డ సముద్రాలు, కెఆర్ ఇండస్ట్రీ యజమాని డి.రమేష్, ఎంఈవోలు టివిఎం.రామదాసు, శ్రీనివాసరావు, హెచ్ఎం పోతురాజు, ఎస్ఎంసీ చైర్మన్ లంకే గోపాలకృష్ణ, జనసేన నాయకులు కోట రాంబాబు, సిద్ధినేని అశోక్ నాయుడు, కాగిత రామారావు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభను జయప్రదం చేయాలి

అవనిగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చేపడుతున్న అమరావతి రాజధాని నిర్మాణ పనుల ప్రారంభానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. జనసేన, బీజేపీ నేతలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. బుచ్చిరాజు, తుంగల మురళీకృష్ణ, తుంగల వెంకట గిరి, శోభిల ఏడుకొండలు, బచ్చు విజయలక్ష్మీ, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, చెన్నగిరి సత్యనారాయణ, కొండవీటి సునీత, బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, తోట కనకదుర్గ, గుడివాక శేషుబాబు, మర్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్ తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభను సమిష్టిగా విజయవంతం చేయాల్సిందిగా ఎంపీపీ రావి దుర్గావాణి విజ్ఞప్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో స్వర్ణభారతి, ఈవోపీఆర్డీ కెటి.సుందరి, ఏవో హెల్సిబా రాణి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ముత్యాలు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీడీవో సుబ్బారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలం నుంచి 10 బస్సులు ఏర్పాటు చేశామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలు సభకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, రెవెన్యూ, వెలుగు, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పులిగడ్డ సర్పంచ్‌కు ఫైర్‌స్టేషన్ సిబ్బంది సత్కారం

అవనిగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సేవా రంగంలో డాక్టరేట్ పొందిన పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌ను అవనిగడ్డ ఫైర్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఫైర్ స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి ప్రసాద్, సిబ్బంది సర్పంచ్ విజయకుమార్‌ను ఘనంగా సత్కరించారు.

నివేశన స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

అవనిగడ్డ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం అందించే నివేశనాస్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నివేశనాస్థలాలు అందించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన వారు సమీపంలోని సచివాలయా ల్లో స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంలో పైపులైన్ల లీకేజీల కారణంగా పలు ప్రాంతాల్లో కుళాయిల్లో రంగుమారిన నీరు వస్తోంది. ఆక్రమణల తొలగింపు సమయంలో పైపులైన్లు పాడయ్యాయి. పైపులైన్లు లీకవడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. దీనిపై అధికారులకు నగర ప్రజలు ఫిర్యాదు చేశారు. దీంతో శిడింబి అగ్రహారం, ఈడేపల్లిలో పైపులైన్ల లీకేజీలను మరమ్మతులు చేపట్టారు.



వీసీ రాంజీ బీటెక్ పరీక్షా కేంద్రం సందర్శన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బీటెక్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ సందర్శించారు. ఉపకులపతితో పాటు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి. వీరబ్రహ్మాచారి ఉన్నారు.